

బాల
MAY 1950
పిల్లల బొమ్మల పత్రిక
6.AS.

తొంగి చూపు!



చి॥ సుగ్గు పంకజాక్షి (వమరవెల్లి)

“ అపూర్వ సోదరిలు ”




చి॥ కాజ వెంకటకృష్ణకుమారి,
హేమలత (తెనాలి)

నిలుపు చూపు!



చి॥ బొబ్బిలిశెట్టి లలితాంబ (విజయనగరం)

ఎదురు చూపు!



చి॥ బాలసుబ్బయ్యశెట్టి (తిరుపతి)

# చందూ యొక్క సాహసము



మనమంతా ఈతకుపోదాము!
దానిలో ఎంతో తమాషా వుంది.
ఒరే, నీళ్ళలో దూరంగా పోవద్దు.
వీడు మన ఆటల ఆనందమును పాడుచేస్తాడు!
HELP!
చందూ, బిడ్డను బ్రతికించావురా.
చందూ, నీవేరా నిజమైన వీరుడు!
హమామ్ సబ్బుతోటి స్నానముకన్న మరేదియూ లేదు. బిడ్డలారా! నిలబడేందుకు వీలుండేచోట మాత్రమే ఈదండి. లోతు నీరువద్దు.

# అమృతాంజనము

తామర తెంపరగా పడుబాధల - తరుమజాలనని భయపడకు
అమృతాంజనము పేరువినినచో - అవియెల్లయు గడగడ వడకు ॥తా॥

తలనొప్పికి తలనొప్పి పట్టును - కంటినొప్పి కనుకనబడదు
పంటినొప్పియు పలాయనంబగు - తుంటినొప్పియు తుడుచుకపోవును॥

ఏదో ఒకరూపముతోవచ్చి - యెల్లరినివియే పీకితినున్
బాధల నణచి సేదదీర్చుకొన - స్వీకరింపు మమృతాంజనమున్ ॥తా॥

రొంపదగ్గు ఎగశోషలకు - చెంపపెట్టు అమృతాంజనము
వాతము పట్లను నరముల పోట్లను - వారించెడి దమృతాంజనము ॥తా॥

తామర గజ్జి సెగ కురుపులను - తరుమ గలది అమృతాంజనము
అలసిన మేనుకు బలము గూర్చును - అమృతాంజనపు మర్దనము ॥తా॥

బుద్ధి బలంబు ప్రయోగ వాధికమై - స్తబ్ధతకూడిన వారలకు
శుద్ధంబైన చురుకు తనము చవి - చూపించెడి దమృతాంజనము ॥తా॥

పని పాటులు చల్లగ చేసుకొని - మనుగడ శ్రీమంతముగ గడుపుకొన
మదిలోపలను ఉవ్విళ్లూరే - మనుజకోటికిని కైదండ యిది ॥తా॥

పట్టములందును పల్లెలయందును - పీఠంబులు నెలకొల్పుకొని
బాధా పీడిత జనులందరికిని - పరమాద్భుతసాయము చేయున్ ॥తా॥

"ఎప్పుడెప్పుడే బాధకలిగినా - తప్పించెడి దమృతాంజనమే"యని
పిన్నపెద్దలు పాడుచుండెడి - ప్రేమ గీత మమృతాంజనము ॥తా॥

♦ గరిమెళ్ళ సత్యనారాయణ బి. ఎ.

# * మే నెల ముత్యాలపంట *

ఐకమత్య మే మహాబలము
అనుమాన మే పెనుభూతము
ఆరోగ్య మే మహాభాగ్యము
సత్య మే జయము
శాంత మే భూషణము
బాలవాక్య మే బ్రహ్మవాక్యము
కోప మే శత్రువు
పుణ్య మే చెడనిపదార్థం
ఉద్యోగ మే పురుషలక్షణం
విశ్వాస మే కోరతగినది
విజ్ఞాన మే వెలుగు
అజ్ఞాన మే చీకటి
వినయ మే గౌరవము
బాలల మే భావిపౌరులము
ప్రజాక్షేమ మే రాజక్షేమము
ఈ జగ మే చిత్రశాల
లోక మే ఒకకుటుంబము

కూర్పు : పి. యస్. నారాయణ (బొబ్బిలి)

# రాము

రాము : అమ్మా! మన పొరు
గింట్లో చెట్టుకి పళ్లున్నాయి.
వాళ్లనిఅడిగేదా?

తల్లి : అలాగే నాయనా! అడ
గందే తీయకుమా!

*

రాము : ఏమండీ! నాకు కొన్ని
పళ్లు కావాలి. ఇస్తారా?

ప్రక్కింటాయన : ఇంద. తీసుకో!

*

రాము : హాయిగా ఆ పళ్లు తిం
టున్నాడు.

# మాటలు నేర్చుకో!

బాలా! ఈ మాటలు పూర్తిచెయ్యి చూద్దాం!

1 క — — ము : ఇది చాలా విలువకలది.

2 క — — ము : ఒక భాష

3 క — — ము : స్త్రీలు ధరించే ఆభరణము.

4 క — — ము : ప్రతీ గ్రామానికీ ఉంటాడు.

5 క — — ము : వివాహము.

6 క — — ము : తాజ్‌మహల్ ఒక గొప్పఇది.

7 క ర్పూ ర ము : తెల్లగాఉంటుంది. గాలితగిలితే హరించి పోతుంది.

8 క ట క ము : ఒరిస్సాకు పాతరాజధాని

9 క వి త్వ ము : ఇది చెప్పగలిగేవాడు బాగా రాణిస్తాడు.

10 క — — ము : కాకి.

11 క హ్లా ర ము : నీటిపువ్వులలో ఒకటి.

12 క — — ము : ఆపదవస్తే దీనికై విచారించాలి.

13 క మ ఠ ము : తాబేలు.


14 క — — ము : ఇలా ప్రవర్తించకూడదు.

15 క పో త ము : శిబిచే రక్షింపబడిన పక్షి.

(జవాబులు ఆఖరు పేజీలలో)

కూర్పు : పిరాట్ల అచ్యుతరామకృష్ణ (కాకినాడ)





# జున్ను ముక్క

— లలిత పంపిన కథ —

అనగా అనగా ఒకవూళ్లో ఒక గొప్ప వాళ్లింట్లో ఒక ఎలుక, ఎలుకపిల్ల వుండేవి. ఆఇంటివాళ్లు రోజూ రొట్టెలు, పళ్లూ, ఫలహారాలు, పిండివంటలూ చేసుకొని తినేవారు. తినగా మిగిలిన వన్నీ ఆ ఎలుక, ఎలుకపిల్ల హాయిగా తింటూ ఆ ఇంట్లో తిరిగేవి. రాత్రుళ్లు భోజనాలయాక ఆ ఎలుకలు మెల్లగా కన్నంలోంచి వచ్చి వంటింట్లో వున్న కూరముక్కలు, రొట్టెముక్కలు అన్నీ తీసుకొనిపోయి కన్నంలో దాచుకొని తినేవి.

ఇలా వుండగా ఒకమారేమయిందీ - ఆ గొప్పవాళ్లింట్లో ఆవు ఈనింది. ఆ రోజున ఆ ఆవు పాలతో మంచి జున్ను చేశారు. ఇంట్లో అందరూ జున్నుముక్కలు తిన్నారు. తినగా ఇంకా కొంత జున్ను మిగిలింది. ఆ జున్ను ఒక ప్లేటులో పెట్టి టేబిలుమీద వుంచారు. రేడియో ప్రోగ్రాం వినడానికి వీధి హాలులోకివచ్చి కూర్చున్నారు.

ఆ రాత్రి మంచి వెన్నెల. మన ఎలుకపిల్ల నెమ్మదిగా గదిలోకి ప్రవేశించింది. అటూ ఇటూ చూసింది. టేబిలుమీద ఒక పళ్లెంలో జున్నుముక్క కనబడింది. తెల్లగా, మిల మిలలాడుతూ ఎంతో బావుంది జున్నుముక్క. ఎలుకపిల్లకి నోరూరింది. టేబిలుదగ్గర కెళ్లింది. కుర్చీ మీదికి ఎక్కింది. టేబిలుమీదికి దూకబోతోంది. ఇంతలో "మ్యావ్!" "మ్యావ్!" అనే అరుపు వినబడింది.!

"బాబోయ్! గండుపిల్లి!" అంటూ ఆ ఎలుకపిల్ల చంగున

గెంతి, తన కన్నంలోకి పారి పోయింది.


కొంతసేపయాక మళ్లీ తిరిగి వచ్చింది ఎలుకపిల్ల. చూస్తే జున్నుముక్క టేబిలు మీద లేదు!

"అరె! నా జున్నుముక్కేదీ! అయ్యో! కొంచెం రుచేనా చూడలేదు. ఎక్కడికి మాయమయిందో!" అనుకుంటూ ఆ ఎలుకపిల్ల ఆగదంతా వెతకడం ప్రారంభించింది. ఇటు చూసింది; అటుచూసింది; మీదికి చూసింది. కిటికీవైపు చూచింది.

"అరె! అదుగో! ఆకాశం మీద తెల్లగా, గుండ్రంగా, తళతళ లాడుతూ మెరిసిపోతోంది! అదే! అదేనాజున్నుముక్క! అరరే! నాజున్నుముక్క ఆకాశంమీదికి ఎలా వెళ్లింది చెప్మా!" అని అనుకుంది. ఎలాగైనా ఆజున్నుముక్కని పట్టుకొని తినేద్దాం అని అనుకొంది. కాని ఆ జున్నుముక్కని అందుకోడం ఎలాగ? - ఛంగుమంటూ కిటికీ ఎక్కింది. కిటికీలోంచి గోడమీద ప్రాకుతూ చూరు ఎక్కింది. చూరుపైనుంచి ఇంటిపైకప్పు ఎక్కింది. తలెత్తి చూసింది. ఆకాశంమీద తనకి ఎదురుగా "జున్నుముక్క" కనబడుతోంది. ఒక్క గెంతు గెంతి పట్టుకుందామని ఎగిరింది. దుబ్బున చూరుమీద పడింది.

"అయ్యో జున్నుముక్కా! నాకు దొరకవేమీ?' అంటూ విచారిస్తూ ఆ ఇంటి కప్పుమీదే అలా చూస్తూ కూచుంది.

తెల్లవారింది. ఎలుకపిల్ల తన కన్నంలోకి పారిపోయింది. ఆ కన్నంలో తన జున్నుముక్కనే తలచుకుంటూ రోజంతా గడి



పింది. మళ్లీ రాత్రిపడింది. ఎలుక పిల్ల మళ్లీ ఆ ఇంటి పైకప్పు ఎక్కింది. అలా ఆకాశంవైపు చూస్తూ కూచుంది. ఆకాశం చీకటిగావుంది. జున్ను ముక్క లేదు. కాని, కొంతసేపయాక ఆకాశంమీద కనబడింది.

"అదుగో! అదుగో! నా జున్నుముక్క!" అంటూ ఆ ఎలుక బాగా చూసేసరికి ఆ జున్ను ముక్కలోంచి ఒక చిన్న ముక్క ఎవరో కొరికేసినట్టు కనబడింది.

"ఎవరు చెప్మా నాజున్ను ముక్క కొరికేశారూ! నిన్న రాత్రి గుండ్రంగా వుండెనే!" అంటూ ఆ ఎలుకపిల్ల మొద లెట్టింది.

కొంచెం సేపయాక ఆ జున్ను ముక్క తనకు దగ్గరగా వచ్చినట్టు కనబడింది. చెట్లకొమ్మల చాటు నుంచి దోబూచులాడు తున్నట్టు కనబడింది.

"అమ్మదొంగా! చెట్ల చాటున దాగున్నావా! నిన్ను పట్టుకుంటానుండు!" అని ఆ ఎలుక పరుగెత్తుకొని వెళ్లి చెట్టుఎక్కింది. కాని ఏం లాభం? ఆ జున్ను ముక్క అక్కడుంటేగా! ఇంకా పైకి ఎత్తుగా ఆకాశంమీద అందకుండానే వుంది. ఎలుకపిల్ల ఏడుస్తూ అలా కూచుంది.

తెల్లవారింది. ఎలుకపిల్ల తన కన్నంలోనికి పారిపోయింది. రాత్రి అయింది. మళ్లీ బయటికి వచ్చింది. జున్నుముక్క కోసం ఆకాశం వేపు చూస్తూ కూచుంది. కానీ, ఎంత సేపటికీ కనబడదు! అలా వుండగా వుండగా నిన్నటి కంటే ఆలస్యంగా ఆ జున్ను ముక్క ఆకాశంమీదికి వచ్చింది. "అరె! ఈసారి నాజున్నుముక్క ఇంకా తగ్గిపోయింది! ఎవరో రోజూ కొరికి తినేస్తున్నారు! అయ్యో! నాకులేదే!" అని ఆ ఎలుక ఏడుపు మొదలెట్టింది. కాని, ఏమిలాభం? అది అందుతుందా!

ఇలాగ రోజూ రాత్రుళ్లు ఎలుకపిల్ల బయటకి రావడం, జున్నుముక్క రోజుకి రోజూ తగ్గిపోవడం జరుగుతూ వచ్చింది.


ఒకనాడు ఆ ఎలుకపిల్ల జున్ను ముక్కకోసం అలా చూస్తూ కూచుంది. ఆ రాత్రి ఆ జున్ను ముక్క అసలే కనబడలేదు!

"నా జున్నుముక్క ఎవరో తినేశారో!" అంటూ గట్టిగా ఏడ్చింది.

ఇంతలో తల్లి ఎలుక ఆ ఏడుపు విని అక్కడికి వచ్చి "ఎందుకమ్మా అలా వెక్కి వెక్కి ఏడుస్తున్నావ్?" అని అడిగింది.

"నా జున్ను ముక్కంతా ఎవరో తినేశారూ" అంటూ రాగాలు తీసింది.

"అయ్యో! అలాగా? ఎక్కడికే? నీకు జున్నుముక్క ఎక్కడిదీ?" అంది తల్లి ఎలుక. ఆకాశంమీద! మొదట్లో గుండ్రంగా తెల్లగావుండేదే అమ్మా! కాని, దానిని ఎవరో రోజూ కొంచెంకొంచెం కొరుక్కొని తినేశారు. ఆఖరికి ఇవాళ అసలే లేకుండా ఎవరో దొంగలించారే! అంటూ ఏడ్చింది.



"ఓహో! ఇదా సంగతీ! ఓసి వెర్రిదానా! అది జున్ను ముక్క అనుకున్నావా? కాదు. అది చందమామ. మొదట నువ్వు చూచావే గుండ్రంగా - అప్పుడు పౌర్ణమి అన్నమాట. ఆ తరువాత రోజుకిరోజూ కొంచెం కొంచెం తగ్గిపోతూ - ఆఖరికి ఈరోజున అసలే కనబడదు. ఈ రోజును 'అమావాస్య' అంటారు. తెలిసిందా? - పద. నీకోసం నేను ఇంకో జున్ను ముక్క తెచ్చాను. తిందుగాని పద" అంది తల్లి ఎలుక.

ఎలుకపిల్ల తనకి తెలిసిన కొత్త సంగతికి సంతోషిస్తూ తల్లి వెంట పరుగెత్తుకుంటూ వెళ్లింది. హాయిగా జున్నుముక్క తింది.



# పొడుపుకథలు

1. ప్రాణిలో నొకప్రాణికి చూడచక్కని పుష్పము. పుష్పానికి ఫలములుకావు. ప్రాణికి కర్రేబీజము. అయిన ఆకర్రేదో చెప్పగలవా? ... ... ... బాలా!

2. చీనావాడు నీటిలోమునిగితే చాలు, చూపరులు చూదామన్నా కనబడడు. ఆకనబడని చీనావాడెవరో చెప్పగలవా బాలా!

3. నీటిలో తెప్పలు తిరుగును. ఈ తెప్పలు చాలామంది కాహారము. ఈతెప్పలేవో చెప్పగలవా? ... ... ... బాలా!

4. ఆవగింజకన్న బలహీనతగల తండ్రికి, భూగోళములో చెప్పకో వలసినంత, భూపుత్రుడౌతాడు. ఆమహా భూపుత్రుడెవరో చెప్పగలవా? ... ... ... బాలా!

5. కర్రలుగలచెట్టు, కర్రలునిండా కాయలే, కాయలుకోడితేగాని కూరలుగావు. అయిన ఆచెట్టేదో చెప్పగలవా? ... బాలా!

6. కర్రలోకర్ర. కడుపుకిమందు. తనకంటె పెద్దవానితో నుంటుంది ఆకర్రేదో చెప్పగలవా? ... ... బాలా!

7 మాయింటిలో బాలకి బొజ్జనిండ బువ్వ, ప్రాకుకి పిన్నుయుంటేనే గాని పాడదు. ఆబాలెవరో చెప్పగలవా? ... బాలా!

8. ఒక పల్లెకోనారి మదరాసువెళ్లి, పట్నమంతాచూచి, యిల్లు మీదిల్లేసి యిరిసి కట్టేరంటాడు కదా! ఆయిరిసికట్టిన యిల్లేదో? ... ... ... బాలా!

9. పక్షులలో నొకపక్షి. ఫలమివ్వనిపక్షి, తనపిల్లలకి పాలిచ్చి పెంచును. అపక్షేదో చెప్పగలవా? ... బాలా!

10. ఎఱ్ఱనిమేడలలో పచ్చనిదీపాలు, దీపాలు చూదామని గోడలు విరగదీసిన, కళ్లవెంబడి నీరుకారును. ఆమేడలేవో? బాలా?

(జవాబులు ఆఖరు పేజీలలో)

కూర్పు : పట్నాయకుని అప్పారావు పట్నాయిక్ (జగన్నాథపురం)


రత్నం
అతిమృదువైనది!
మైసూరు
శాండల్ సోప్

# * మంచి ఇంగువ *

'మంచి ఇంగువ వేసినట్లయితే, యీ కూర ఎంతో రుచిగా వుండేది' అని ఒకొక్కప్పుడు అతిథులు అంటూవుంటారు. చాలామంది. మంచి ఇంగువ ఏదో తెలియక, ఏదో వొకటి కొంటూవుంటారు. మంచి ఇంగువ కావాలంటే, 'తిలక్ మార్కు' ఇంగువ కొనాలి.

'తిలక్ మార్కు ఇంగువ' అన్నిచోట్లా దొరుకుతుంది. లేదా, యీక్రింది అడ్రసుకు వ్రాసి తెప్పించుకోవచ్చును.


## గోపాల్‌జీ చాంప్‌షీ అండ్ కో.,

30, గోవిందప్పనాయక్ వీధి • • జి. టి. మదరాసు.




బాలా!

ఈ ఆరుగురు (చెవులపిల్లి) దొరలూ ఎండాకాలం షికారుకి బయలుదేరారు.



1 2 3



4 5 6

ఇందులో ఇద్దరు కవల పిల్లులు. వాళ్లెవరో తెలుసుకో గలవా? లేకపోతే ఆఖరు పేజీలలో జవాబు చూడు.

# నాటకం



రచన: "తపతి" (కాకినాడ)

స్టేజిని రెండు భాగాలుగా విభజించాలి. ఒక భాగం ఒక చిన్న గదిమాదిరిగా తయారు చేయాలి. రెండో భాగం ఒక వసారాక్రింద తయారుచెయ్యాలి.

(ప్లీడరుగారు అప్పుడే కోర్టు నుండి యింటికివచ్చారు. కోటూ అవీవిప్పి మేడమీదికి వెళ్లగానే గదిలో ఏదో పెద్దగోల వినపడింది.)

ప్లీడరుగారు :-(తనలో) ఈకుర్ర వెధవలకున్న తెగులే! ఇంట్లో ఒక్క క్షణం లేకపోతే సరి ఇల్లు తీసి పందిర వేస్తారు.

[గది తలుపులు వేసివున్నాయి. లోపల జరుగుతూంది ఏదో భాగోతం.]

ప్లీ :-(తనలో) ఈగోల చేయటానికి కారణమేమై యుంటుందీ? గబాలున తలుపు తోశానంటే ఈవెధవలు కుక్కిన పేనుల్లా మళ్ళీ మాట్లాడరు. ఎంత గొంతుక చించుకున్నా కారణం చెప్పరు. అందుచేత చాటునవుండి సంగతు లేమిటో తెల్సుకోవాలి. (ఆలకించి) అదిగో! గోపిగాడూ, రంగడూ, సుశీకూడా ఏదో దెబ్బలాడుకుంటున్నట్లు ఉన్నారు.

(లోపలనుండి)

రంగడు :-నాకేమీ తెలీదు! చెయ్యివదులు ముండర!

గోపి :-నేను వదలను! నువ్వే తీశావ్! ఎందుకొచ్చిన అబద్ధాలు. అందుకనే నిన్నందరూ అబద్ధాలకోరు అని ఏడిపిస్తారు. చెప్పకపోయావా నీపరీక్ష పోయిందని నాన్నతో చెప్పేస్తా.

రంగ :-చెప్పుకోవోయ్! ఎప్పటికైనా తెలిసేదే కదా!

గోపి :-చెల్లిని చావగొట్టావని

చెప్పేస్తా!

(బయట)

ప్లీ :-(తనలో) ఆ! ఆడపిల్లమీద చెయ్యి చేసుకుంటాడా వెధవ! వీడు పరీక్షకూడా తగలే శాడులావుంది. దున్నపోతు వెధవ...నా అదృష్టంకొద్దీ దొరికాడు.!

(లోపలనుండి)

రంగ :-చెప్పుకో! ఎన్నయినా చెప్పుకో! నన్ను నాన్నేం చెయ్యగలడు! కొడ్తాడా! కొట్టనీ! పెట్టెలో వందరూ పాయిల చిల్లర పట్టుకుని ఎక్కడికైనా పారిపోతా.


సుశీల :-(గోపితో) అంతేరా వీడు! ఎన్ని చెప్పినా వినడు! వినాశకాలం సమీపించింది ఈ బడుద్ధాయికి.

రంగ :-ఏమన్నావ్! శని గ్రహమా (అని చీపురుకట్టతో కొట్టుతున్నాడు.)

సుశీల :-(ఏడుస్తూ) ఆ!...ఆ! ఉండు...నీపని. నాన్నతో.. చెప్తా...నిన్న నాన్న దస్తా వేజుల కాగితాలు పడవలు చేసి వానలో ఆడావని... ఊ...ఊ...

(బయట)

ప్లీ :-(తలుపు దబదబా, బాదుతూ) ఒరే! రంగాయ్! తలుపుతియ్యి వెధవా! (గోపి, సుశీల, రంగడు భయపడుతూ తలుపు తెరుస్తారు.)



ప్లీ :-ఏమిట్రా చచ్చు వెధవా! నాదస్తావేజు కాగితాలన్నీ పడవలాట ఆడావురా వెధవా! నీవింత పొగరుబోతు వనుకోలేదురా! దాన్నలా గొడ్డును బాదినట్లు బాదుతావేం! నిన్ను బాదుతే (అని చేతికర్ర ఎత్తును)

రంగడు :-అదికాదు నాన్నా!

ప్లీ :-ఏమిటికాదూ! నీబొంద! నీకు భయమూ భక్తీ అంటూ ఏడిశాయీ! తల్లి లేకపోయినా ఎంతో గారాబంగా పెంచినాననే గౌరవం కూడా లేదురా నీకు! నీవు పరీక్ష పోగొట్టు కున్నావూ? నాకు తెలుస్తే వందరూపాయలు పట్టుకొని పారిపోతావూ? సరే!...వెళ్ళు... వెళ్ళేవాడిని ఎన్నాళ్ళని ఆపగలం

రంగ :-ఉత్తిదేనాన్నా!

ప్లీ :-ఏమిటీ? ఉత్తిదా! నేను వినటం ఉత్తిదా! నీవు పాడు కూతలు కూయటం ఉత్తిదా! దొంగవెధవా ఇంకా నాటకమాడుతున్నావూ? నాతోరా నీనాటకాలు? (అని చేతికర్ర మళ్ళీఎత్తును.)

గోపీ :-అవును! ఉత్తిదే నాన్నా! నాటకమే మేము ఆడుతూంటా! రేపు మాబడిలో నాటకం నాన్నా, మేము రిహార్సల్స్ వేసుకుంటూ న్నాం.

ప్లీ :-ఆ! ... (నిర్ఘాంతపోయి) అయితే రంగాయ్! నీపరీక్ష పోవటం, నాదస్తావేజు కాగితాలు పాడుచేయటం, అంతా వుత్తిదే నన్నమాట.

గోపి :- (వస్తూన్న నవ్వు ఆవుకుంటూ) అంతా వుత్తిదే నాన్నా! రేపు మాబడిలో "అబద్ధాలకోరు" లేక "ప్లీడరుగారబ్బాయ్" అనే పిల్లల నాటకం వేస్తున్నాము. అందులో నేనూ, తమ్ముడూ, చెల్లీ కూడా నటిస్తున్నాం. ఇదిగో ఆహ్వానపత్రిక. రేపు మీరు ఎలాగైనా వీలు చూచుకుని రావాలినాన్నా!

ప్లీ :-(ఆశ్చర్యంతో) ఎంతనాటక మాడావ్రా నాయనా (అని ఆహ్వానపత్రిక అందుకుని నవ్వుకుంటూ లోనికి వెళ్ళారు.)

(తెర)

# సెలవుల్లో సరదాలు

బాలా !

వేసంగి సెలవులొచ్చాయి! బడికి వెళ్లనక్కరలేదు. ఇంట్లో ఏమీ తోచదు. చీట్లపేక ఆట, చింతపిక్కలాట, కేరమ్సు ఇవన్నీ వుండనె వున్నాయి.

మధ్యాహ్నం, కొంచెం ఎండ తగ్గగానే, నీనేస్తాలు నీఇంటికి వస్తారు, వాళ్లతో సరదాగా కాలక్షేపం చేయడానికి ఇదుగో కొన్ని గమ్మత్తులు!

మొట్ట మొదట నీస్నేహితులకు హుషార్ పుట్టడానికి కొన్ని ప్రశ్నలు వెయాలి.

## ప్రశ్నల వర్షం:

1. ఏంవోయ్ పుల్లయ్యా! బడిలో ఏయేనెలలకు ఎన్నెన్ని రోజులో చదివావు. ఏదీ ఏనెలలో 28 రోజులున్నాయో చెప్పు చూద్దాం,?
2. ఇంకో ప్రశ్న-నువ్వు కొన్నప్పుడు నల్లగాను వాడినప్పుడు ఎర్రగాను, పారేసినప్పుడు తెల్లగాను ఏదివుంటుందోయ్?
3. నువ్వు ఎన్నో తలలుచూశావు. దేనికి తలవుంటుంది గాని ముఖములేదు?
4. ఆనందము ఎల్లప్పుడూ ఎక్కడ వుంటుంది?
5. అందరూ ఇవ్వడానికి సిద్ధపడతారుకాని కొద్దిమందే తీసుకుంటారు. ఏమిటి?
6. ఏ దోమలు కరుస్తాయి?
7. కందిరీగ "గీ" మంటూ ఎగురుతుంది. ఆ "గీ" శబ్దం ఎక్కడిదీ?

8. ఒకటి వుంది. అది నువ్వు తీయకుండా వుండలేవు. అదేమిటి ?
9. నువ్వు కాఫీలో పంచదార కుడిచేత్తో కలుపుతావా ఎడమచేత్తో కలుపుతావా ?

ఈ ప్రశ్నలన్నీ కాగితాలమీదరాసి, నీ స్నేహితులకి ఇయ్యి. ఇందులో ఎందరు ఎన్నిరైటుగా రాస్తారో. (జవాబులు ఆఖరిపేజీలో వేశాను. వాళ్లకి చూపించకేం !)

ఈప్రశ్నాపత్రం అయిపోగానే నీస్నేహితులకు ఒకగమ్మత్తు చేసి చూపించు. అదేమిటంటే కన్నంలోతల.

## కన్నంలో తల !

నువ్వు ఒక ఆంధ్రపత్రికో, ఆంధ్రప్రభో, విజయప్రభో - ఒక పత్రిక తీసుకొని, ఆపెద్ద కాగితం మధ్యన గుండ్రముగా ఒక నారింజపండు దూరినంత కన్నం చెయ్యి.

"స్నేహితులారా ! వింత ! వింత ! బలేవింత ! ఇదుగో చూడండి. ఈ కన్నంలోనుంచి నాతలను పొడుస్తాను. మీరుకూడా పొడవగలరా ? కాగితం చిరిగిపోకూడదు ! ఏదీ చేయండి" _ అని ఒక ఉపన్యాసం కొట్టు.

నీ స్నేహితులు ఆశ్చర్యపోతారు ! అంతచిన్న కన్నంలో తల దూరుతుందా ? కాగితం చిరిగిపోదూ ? - అని వూరుకుంటారు. అప్పుడు నువ్వు ఆపేపరునుతీసి, నీతలమీద పెట్టుకో. కన్నంవున్న చోట, నీతలజుట్టు కనిపిస్తూ వుంటుంది. నీవు నీచేతివేలుతో ఆకన్నంద్వారా నీతల పొడుచుకో ! "అదుగోచూశారా, ఈ కన్నంలోనుంచి (నావేలితో) నాతలను పొడిచాను !" అనిచెప్పు.

నీయుక్తికి నీస్నేహితులు మెచ్చుకుంటారు. ఆతరువాత మీరందరూ కలిసి ఈఆట ఆడండి.

# తలచుకొన్నది ఇరవై ప్రశ్నలలో తెలుసుకోగలవా?

నువ్వు ఏదేనా ఒక వస్తువును తలచుకో. ఆవస్తువ మీ ఇంట్లోదో, బడిలోదో మీరందరూ సాధారణముగా చూచినదే అయివుండాలి.

నీవు తలచుకొన్న వస్తువును నీస్నేహితుడు పోల్చుకోవాలి. అతను నిన్ను ఇరవై ప్రశ్నలు వేయవచ్చును, ఆ ప్రశ్నలకు జవాబు "అవును" "కాదు" అని నువ్వు చెప్పాలి. అలా చెప్పగా ఇరవై ప్రశ్నలలోపుగా నీవు తలచిన వస్తువును నీస్నేహితుడు పోల్చుకోవాలి.


ఉదహారణకి: "పెన్ను" తలచుకొన్నాం అనుకుందాం. నీస్నేహితుడు ఇలా ప్రశ్నలు వేస్తాడు:

1, నువ్వు తలచుకొన్నదానికి ప్రాణంవుందా? (జవాబు: లేదు); 2. అది ఈ గదిలో వుందా? (ఉంది); 3. గోడమీద వుందా? (లేదు); 4. టేబిలుమీద వుందా? (లేదు); 5. దానిని నువ్వు ఉపయోగిస్తావా? (అవును); 6. పొడుగ్గా వుంటుందా? (అంత పొడుగూకాదు, పొట్టికాదు); 7, లావుగా వుంటుందా? (ఉండదు); 8. పలచగా వుంటుందా? (ఉండదు); 9. తెల్లగా వుంటుంవా? (ఉండదు); 10 ఎప్పుడూ నీదగ్గరవుందా? (తరచు వుంటుంది); 11. ఇప్పుడు నీదగ్గరవుందా? (వుంది); 12. జేబులో వుందా? (వుంది); 13. పెన్సిలా? (కాదు); 14. పెన్నా? (అవును.)

ఈ విధంగా ఇరవైప్రశ్నల లోపుగానే జవాబు చెప్పించాలి. ఇది ఒక ఆట.

## జతలు:

ఒక పెద్ద కాగితంమీద ఈ చదరంలోలాగ గళ్లు గీసి, నీస్నేహితుని చేతిలో పదహారు చింతపిక్కలు పెట్టు.




నీస్నేహితుడు ఏమిటి చేయాలంటే - ఆ 16 పిక్కలను 8 జతలుగా ఆ గళ్లలో పెట్టాలి. జతలు నిలువుగా వుండొచ్చు, అడ్డంగా వుండొచ్చు. కాని, జతలు కలిసిపోకూడదు. అంటే వరసగా మూడుపిక్కలు ఎక్కడా వుండకూడదు. ఏదీ, నీ స్నేహితుడ్ని అలాగ చేయమను చూద్దాం!

## అగ్గిపుల్ల గారడీ!

నీస్నేహితులను పిలిచి, వాళ్లకి ఒక జేబురుమాలు చూపించు. ఒక అగ్గిపుల్లను తెచ్చి ఆరుమాలుమధ్యన వుంచి, ఇలా అను:

"స్నేహితులారా! నేను గొప్ప గారడీ నేర్చాను. ఈ రుమాలులోవున్న అగ్గిపుల్లను చేతితోనొక్కి విరిచేస్తాను. ఇదుగో వినండి. విరిచిన చప్పుడు" -

(ఎవరి చెవిదగ్గరేనా, వాళ్లకి వినబడేటట్టు అగ్గిపుల్లను విరచాలి.)

ఆతరువాత ఆ రుమాలు విప్పిచూపిస్తే అగ్గిపుల్ల అలాగే వుంటుంది, విరగకుండా !


ఈ గారడీచూసి అందరూ ఆశ్చర్యపోతారు. నువ్వు ఈ గారడీ చేయడానికి పూర్వమే, ఆ రుమాలు అంచుల మడతలో నాలుగువైపులా నాలుగు అగ్గిపుల్లలు దూర్చి, కుట్టాలి. అగ్గిపుల్ల విరిచేటప్పుడు ఆ అంచులోవున్న అగ్గిపుల్లను గమ్మత్తుగా విరిస్తే ఎవ్వరూ పొల్చుకోలేరు !

మీరందరూ ఇలా ఆడుకుంటుంటే మీ చిట్టి చెల్లాయిలు, చిట్టి తమ్ముళ్లూ వూరికే కూర్చుంటారా ? అల్లరిచేస్తారు. అంచేత వాళ్లకికూడా ఒక ఆట కల్పించిచెప్పు. ఆడుకుంటారు. ఇదుగో ఈ ఆటచెప్పు.

## సిగరెట్టు డబ్బాల ఆట

ఈ ఆటకి కావలసిన వస్తువులు : కొన్ని సిగరెట్టు డబ్బాలు (ఉత్తవి): పొడుగాటి చిన్నకర్రలు (కోలాటం కర్రలుంటే చాలు.)

ఈఆట ఏమిటంటే_ ఆ సిగరెట్టు డబ్బాలను కర్రతో తోస్తూ, దొర్లించుకుంటూ, గది ఈ వైపునుండి ఆవైపుకి నడిపించాలి. సిగరెట్టు డబ్బాలను కర్రతో కొట్టకూడదు, తోసుకుంటూ పోవాలి. ఎవరిడబ్బా ముందు "గోలు" చేరితే వాళ్లు గెలిచినట్టు.




# తిమ్మడు అంగడు కథ

రచన. B. రామచంద్రరాజు (కొండాపురం)

మన ఆంధ్రదేశమును చాల మంది రాజులు పాలించారు. వారిలో శ్రీ కృష్ణదేవరాయలు గొప్పవాడు. ఆయన కవులను, పండితులను పోషించేవాడు.

రాయలవారి కొలువులో తిమ్మడు అనుపేరుగల ఒకసేనా నాయకుడు ఉండేవాడు. అతడు నమ్మదగినవాడు, కాబట్టి రాయలు అతనిని తనవాకిలి కాయుటకు నియమించాడు. అందుచేత అతనికి వాకిలికావలి తిమ్మడు, అను పేరుకూడ కలిగింది.

ఒకసారి శ్రీ కృష్ణదేవరాయలు తిమ్మన్నకు ఒక పట్టు పచ్చడమును బహుమానముగా ఇచ్చాడు. ఒకనాడు తిమ్మన్న ఆపచ్చడమును కప్పుకొని తన యింటివీధి అరుగుమీద కూర్చున్నాడు. ఆ సమయమున అల్లసాని



పెద్దన్న, ముక్కు తిమ్మన్న, రామరాజ భూషణుడు, తెనాలి రామలింగడు అను కవీశ్వరులు ఆదారిని పోవుచుండిరి. వీరు నలుగురు తిమ్మన్నకు స్నేహితులు. పెద్దన్న అతనిని చూడగానే-

'వాకిలికావలి తిమ్మా,'

అని ఒకపద్యము ప్రారంభించెను. వెంటనే ముక్కు తిమ్మన్న

'ప్రాకటముగ సుకవివరుల-
పాలిటి సొమ్మా!'

అని రెండవ చరణమును చెప్పెను. రామరాజ భూషణుడు అందుకొని-


'నీకిదె పద్దెము కొమ్మా'

అని మూడవ చరణము చెప్పెను. వెంటనే కొంటెవాడైన రామలింగడు

'నాకీ పచ్చడమెచాలు
నయముగనిమ్మా!'

అనిపద్యమునుపూర్తిచేసెను.

తిమ్మడు రామలింగ కవిని మెచ్చి తనపచ్చడమును అతనికి బహుమానముగా నిచ్చెను. పెద్దనకవి రామలింగని యుక్తికి నవ్వెను.





# బలే జోస్యం

రచన: గోపాలరావు (న్యూఢిల్లీ)

అనగా అనగా ఓ ఊళ్లో ఓ బ్రాహ్మడు తనపెళ్లాం పిల్లలతో కాపురం ఉంటూండేవాడు. ఓనాడు అతను ఓ అడవిలోంచి ప్రయాణంచేస్తూ ఇంకో ఊరికి ఏదో పనిమీద పోతున్నాడు. తోవలో ఆ ఊరి మహారాణి గారు, ఆమె చెలికత్తెలూ కాళ్లు కాలిన పిల్లుల్లాగ ఇటూ అటూ తిరుగుతూ దేన్నో వెతుక్కుంటూ వస్తూండడం అతను చూశాడు. వెంటనే అతను మహారాణీగారికి ఎదురుగా వెళ్లి నమస్కారంచేసి "ఏలినవారు దేనిని ఇల్లా వెతుకుతున్నారు?" అని అడిగాడు. దానికి మహారాణీ గారు:

"మాది ఒక చిన్నకుక్క తప్పిపోయింది. దాన్ని వెతుకుతున్నాం. నీవుగాని దాన్ని ఎక్కడైనా చూశావా?" అని అడిగారు.

బ్రాహ్మడు:- మీకుక్క ఆడ కుక్కగదూ!

మహారాణీ:-అవు నవును చూచావా?

బ్రా:-మీ కుక్కకు పొడుగాటి చెవులున్నాయి కదూ?

మహా:-అవును. అదే.

బ్రా:-అది మొన్ననే పిల్లలు పెట్టింది. నిజమేనండి?

మహా:-అదేనయ్యా! ఎక్కడ కనిపించింది?

బ్రా:-దానికి ఎడమ ముందు కాలుకి కొంచెం కుంటికూడా ఉంది. అవునా?

మహా:-"ఏమయ్యా! నీకేమైనా ఇచ్చుకుంటాం దానిని ఎక్కడ చూచావో చెబుదూ" అని బ్రతిమాలుతుంది.

బ్ర :-అబ్బే లేదురాణీ! మీకు అలాంటి కుక్క ఉన్నట్లే నాకు తెలియదు. నేను దాన్ని ఎక్కడా చూడనుకూడా లేదు. అని చెప్పేసి నాకింక శలవిప్పించండి అని మళ్ళీ తనదారిని పోతున్నాడు.

అలా పోతూండగా కొంత దూరం వెళ్లిన తరువాత ఆఊరి మహారాజుగారిమంత్రిగారున్నూ, సేవకులూ అటూ ఇటూ పరుగులెడుతూ వాళ్లుకూడా దేన్నో వెతుక్కుంటూ వస్తూండడం మన బ్రాహ్మడు చూశాడు. వారికెదురుగా పోయి ఏలినవారు దేన్నో వెతుకుతూన్నట్లుంది అన్నాడు.

మంత్రి :-అవునండి మహాప్రభువుగారి పెంపుడు గుఱ్ఱం కట్లు తెంచుకుని ఈ దారిని పారిపోయింది. దాన్నే వెతుకుతున్నాం. మీరుగాని ఆ గుఱ్ఱాన్ని తోవలో ఎక్కడైనా చూశారా?

బ్రా :-ప్రభూ మీగుఱ్ఱం అయిదు అడుగుల ఎత్తుంటుంది కదూ?

మం :-అవునండవునండి. అంతే! మీరు చూశారా?

బ్రా :-దాని తోక పొడవు 3½ అడుగులుంటుంది. అవునా?

మం :-అవును బాబూ! ఎక్కడ చూశారూ? ఈ తోవలోనేనా?

బ్రా :-దాని కళ్లెం చివర బంగారుతొడి ఉంది. అవునండి?

మం :-చిత్తం. చిత్తం.

బ్రా :-దాని డెక్కలకి వెండి రేకులు తాపించారు అవునా?

మం :-చిత్తం. బాబూ త్వరగా శలవియ్యండి ఎక్కడ చూశారో. అది దొరకకపోతే మాపీక తెగిరిపోతాయండి. బాబ్బాబూ!

బ్రా :-అబ్బే, లేదండీ! మీ రాజుగారికి అలాంటి గుఱ్ఱం ఉందని నేనెరుగను. దాన్ని నేనెక్కడా చూడలేదు కూడాను.

అని బ్రాహ్మడు తన దారిని పోతూండగా మహారాణీగారు ఆమె చెలికత్తెలూ అక్కడికే వచ్చి ఈ సంగతి తెలుసుకొని ఈ బ్రాహ్మణ్ణి పట్టుకుని కైదులో ఉంచండి. నాకుక్కనూ, రాజుగారి గుఱ్ఱాన్నికూడా ఇతడే దొంగిలించాడు. అని ఆమె అతన్ని సేవకులకు వప్పగించి రాజుగారి

దగ్గిరకు తీసుకుపోయింది. రాజుగారుకూడా ఇదివిని, తమ రెండు జంతువుల్నీ ఇతడే దొంగలించాడని నిశ్చయించారు. అతనికి 1½ సంవత్సరాలు శిక్ష విధించారు.

ఇది జరిగిన కొంతకాలానికి రాజుగారి పెంపుడు గుఱ్ఱమూ రాణీగారి పెంపుడుకుక్కా మరో ఊర్లో దొరికాయి! అప్పుడు ఆ బ్రాహ్మణ్ణి అనవుసరంగా శిక్షించామని, అతన్ని తనవద్దకు తీసుకురమ్మని, మహారాజుగారు సేవకుల్ని పంపించారు. ఆ సేవకులు పోయి కైదులోవున్న బ్రాహ్మణుని మహాప్రభువుల ఆజ్ఞ అయిందని తీసుకుపోయి రాజుగారి ఎదుట నిలబెట్టారు.



మహారాణీగారు :- ఏమో యీ బ్రాహ్మడా, మా గుఱ్ఱాన్నీ, కుక్కనూ, నీవు దొంగలించలేదని ఈరోజు రుజువు అయింది. కాని నాకొక సందేహం ఉంది. అది నీవు తీర్చాలి.

బ్రా :- ఏలినవారి ఆజ్ఞ.

మహా :- నీవు మా గుఱ్ఱాన్నీ, కుక్కనూ ఎన్నడూ చూడలేదన్నావు కదా అలాగైతే వాటి ఆనవాళ్లు ఎలా చెప్పగలిగావు?

బ్రా :- నేను మీ రెండు జంతువుల్నీ ఎన్నడూ చూసి ఎరుగను, కాని ఎలా చెప్పగలిగానని అడిగారు కనుక మనవి చేస్తున్నాను. నేనా అడవిలోనుంచి వస్తూండగా ఇసుకలో చిన్న పాదాల ఆనవాళ్లు చూసేను. చూసీ చూడ్డంలో ఆపాదాలు ఒక చిన్నకుక్కవని గ్రహించాను. ఆ ఆనవాళ్లు చాలా తేలికగా ఉండడంవల్ల అది ఆడకుక్క

అనిన్నీ, కొద్దిరోజుల క్రితమే పిల్లల్ని పెట్టి ఉంటుందనీ గ్రహించాను. దానిముందరి ఎడమకాలు యొక్క ఆనవాలు మరీ తేలికగా ఉండడంవల్ల ఆకాలుకు కొంచెం కుంటు ఉన్నదని ఊహించాను. దాని ముందరి కాళ్ల యొక్క ఆనవాళ్లకు రెండు ప్రక్కలా కొంచెం తేలికగా ఇసుక రేగి ఉండడంవల్ల దానికి పొడుగాటి నేలకు తగులుతూన్న చెవులున్నవని అతి సులువుగా తెలిసింది. ఇక గుఱ్ఱంగురించి ఎలా తెలిసిందంటే, ఆ అడవిలో నేను పోతూఉన్న తోవ ఒకచిన్న సందు లాటిది. దానికి రెండు పక్కలా చిన్న చిన్న పొదలున్నాయి, ఆతోవలో గుఱ్ఱం డెక్కల ఆనవాళ్లు కనిపించాయి, ఆ ఆనవాళ్లు సరిగ్గా తోవకు మధ్యగా ఉన్నాయి. ఆ తోవ వెడల్పు 7 అడుగులుంది. తోవకు రెండు పక్కలా ఉన్న పొదల ఆకులమీద అక్కడక్కడ ధూళి రేగి ఉంది. అలాగ ఒకేచోట రెండు పక్కలనున్న ఆకుల మీదా ధూళి చెరిపివేయబడి ఉండడంచేతనూ, తోవ వెడల్పు 7 అడుగు లుండడం చేతనూ దానితోక పొడుగు 3½ అడుగులని తెలిసింది. నేలమీద ఉన్న చిన్న చిన్న రాళ్లమీద వెండి గీత లుండడంవల్ల దాని డెక్కల మీద వెండిరేకు లున్నాయని గ్రహించాను. తోవకు ఒక ప్రక్కనున్న గుండు రాళ్లమీద బంగారు గీట్లుండడంవల్ల దాని కళ్లెం చివర బంగారుతొడి ఉందని తెలిసింది. అల్లా ఆ ఆనవాళ్లు ననుసరించి పోగా కొంత దూరాన్ని ఒక చెట్టు క్రింద కొత్తగా ఆకులురాలి ఉండడం చూచాను. ఆచెట్టుయొక్క అడుగుకొమ్మలు గుఱ్ఱం నడ్డికితగిలి ఆ ఆకులు రాలి ఉంటాయనుకున్నాను. చెట్టు అడుగుకొమ్మలు నేలనుంచి 5 అడుగులు ఎత్తుండడంవల్ల గుఱ్ఱం ఎత్తు 5 అడుగులు అని చెప్పగలిగాను. అంతేగాని మీజంతువుల్ని నేను చూడనే లేదు.

మహారాజు ఇదంతా విని ఆ బ్రాహ్మణునియొక్క తెలివితేటలకు సంతోషించి సరే, నిన్ను

విడిచి పెట్టేస్తున్నానని వెంటనే అతన్ని వదిలివేయమని ఆజ్ఞాపించేడు. తరువాత ఆ బ్రాహ్మడు సభవారివంక తిరిగి నన్ను పట్టుకోడంలో ఏలినవారి తప్పేమీ లేదు. మనిషికి తెలివి తేటలు లేకపోతే ఎంత నష్టమో, తెలివి తేటలు అమితంగా ఉండడం కూడా అంతనష్టమే అని అక్కడ నుండి శలవు తీసికొని తెలివి తేటలు ఎక్కువైతే......జైలు శిక్ష అనుకుంటూ తనదారిని పోయాడు.

(ఒక ఆంగ్లకథకు అనువాదం)

# కొత్త గుణింతం

బాలా!

మన చెట్లలో ఈ ఇంగ్లీషు అక్షరాలు ఎలాగున దూరాయో చూడు!

1. మామిD చెట్టు
2. అరT చెట్టు
3. తాT చెట్టు
4. జీD చెట్టు
5. కCVంద చెట్టు
6. సరిVD చెట్టు
7. ఉCరి చెట్టు
8. Gల్లేరు చెట్టు
9. బాDద చెట్టు
10. నేరD చెట్టు
11. గోంకుD చెట్టు
12. రాV చెట్టు

కూర్పు: ఎ. నాగభూషణం
క. కోటపాడు

# కాశీపట్నం

అన్నయ్యా!

నాకు కాశీవెళ్లినట్లు కల వచ్చింది. ఈ పద్యం నేనే రాశాను. బాలలో అచ్చువేయవూ!

కాశీపట్నం చూసేము
గంగలోమునిగి వచ్చేము
కాశీలోనికి వచ్చేము
అందరము అందరము
శివునికి పూజలు చేసేము
కాశీపట్నం చూసేము
గంగలోమునిగి వచ్చేము.


మీ చెల్లి, వసంతరావు కామేశ్వరి

బాల
(పిల్లల బొమ్మల పత్రిక)
చందా సాలుకు రూ3/-
"బాల" ఆఫీసు
170, రాయపేట హైరోడ్,
మదరాసు-14.

# ఇవి చేసుకోండి

రచన : డి. శ్రీనివాసరావు (మదరాసు)


సైకిల్ ట్యూబును మీరంతా చూసే వుంటారు. సైకిల్ టయర్‌లో వుంటుంది, అదే రబ్బరుది. ఈ బొమ్మలో వుంది చూడండి. కొన్నాళ్లు వాడాక యీ రబ్బరు ట్యూబులు పాడయి పోతాయి. ఈ పాడయి పోయిన రబ్బరు ట్యూబులు సైకిల్ షాపుల్లోను, సైకిళ్లున్న యిళ్లలోను వుంటూనే వుంటాయి. మనం యీపాత ట్యూబులతో అనేకమైనవి చేసుకోవచ్చు. వీటిని సంపాదించడం అట్టే అంత కష్టమైన పనికూడాకాదు. రబ్బరు లాగే సాగుతుంది. సరదాగా వుంటుంది ఆడుకోడానికి.



ఈ ట్యూబును అడ్డంగా కత్తిరించి నట్లయితే రబ్బరు గొట్టాలు తయారవుతాయి. ట్యూబును దగ్గఱ దగ్గఱగా కత్తిరించి నట్లయితే సన్నవి, చిన్నవి రింగుల్లా వస్తాయి. మన అవసరాన్నిబట్టి కావలసిన సైజుల్లో కత్తిరించుకోవచ్చు.

సైకిల్ హేండిల్ బార్‌కి మనం చేతులతో పట్టుకొనేచోట యీ రబ్బరుట్యూబు గొట్టాల్ని దూర్చుతారు. చేతులకు మెత్తగా వుంటుంది. ఈట్యూబు గొట్టాల్నే కాళ్లతో తొక్కే సైకిల్ పెడల్‌కి కూడా దూర్చుతారు. మనం బంతి ఆడుకునే బేట్‌కికూడా పట్టుకునే చోట యీ గొట్టాన్ని పెట్టుకోవచ్చు. ఇవన్నీ మీరు చూసే వుంటారు.

సైకిల్ ట్యూబుకు పేచ్ వేసే రబ్బరులేనప్పుడు పాతట్యూబును చిన్న ముక్కగా కత్తిరి



వాడుతూ వుంటారు కూడాను.

కుళాయి గొట్టం నుంచి కొంచెం దూరంలోవున్న తొట్టెలో నీళ్లు పడాలంటే ట్యూబును కావలసినంత పొడుగుకి కత్తిరించి కుళాయి గొట్టంపైనదూర్చిగట్టిగా మెత్తని తాడుతో కట్టివేస్తే చాలు. ట్యూబు రెండోకొనని తొట్టిలో వుంచండి. కుళాయి త్రిప్పితే ట్యూబులోంచి నీళ్లు తొట్టిలోకి వస్తాయి.

చెరుపుకునే రబ్బరు లేనప్పుడు ట్యూబు ముక్కతో చెరుపుకో వచ్చును.

సైకిల్ తొక్కేటప్పుడు మన పంట్లాం సైకిల్ చైన్‌లో పడకుండా క్లిప్పులను తగిలిస్తూ వుంటాం. సమయానికి క్లిప్పు లేకపోతే ట్యూబునుంచి కత్తిరించిన చిన్నరింగు పని జరుపుతుంది.

మన కాలిజోడు తెగిపోయినప్పుడు బాగు చేయించడానికి వచ్చేదోవలో కాలిజోడు అంటిపెట్టుకునేందుకు రెండు చిన్న రబ్బరు రింగులను పాదానికి జోడుకు కలిపి ఎక్కిస్తేచాలు. బొమ్మలో చూడండి.

వ్రాసిన కాగితాలనుగాని పాత వుత్తరాలనుగాని కట్టగా వుంచాలంటే ఒక ట్యూబు రింగును సాగదీసి తగిలించండి.

గాలి వేసినప్పుడు పుస్తకాల్లో పెట్టిన చిన్న చిన్న కాగితాలు ఎగిరిపోకుండా ఒక రబ్బరురింగును పుస్తకానికి తగిలించుకో వచ్చు.

చిన్న అట్ట పెట్టెల మీద మూతలు వూడిపోకుండా వుండడానికి రబ్బరు రింగును తగిలించుకోవచ్చును.

ప్రయాణాల్లో చిన్న అద్దం దువ్వెన జతగా వుండాలంటే



ఒక రబ్బరు రింగును తగిలించండి.

చిన్న పలకలకు బందులు వూడిపోయినప్పుడు, చిన్న ఫోటోలకి, అద్దాలకి ఫ్రేములు వూడిపోయినప్పుడు యీ రబ్బరు రింగులను తగిలించినట్లయితే బాగు చేయించుకొనేదాకా జాగ్రత్తగా వుంటాయి.

ఈ ట్యూబునుంచి గుండ్రని లేక, నలుచదరమైన ముక్కలు కత్తిరించవచ్చు. టేబిల్ మీద, అలమార్లలోను యీ ముక్కలు వుంచి వాటిమీద సిరాబుడ్లు పెట్టుకోవచ్చు. సిరామరకలు అవకుండా వుంటాయి.

ఈ ట్యూబును నిలువుగా సన్నని పొడుగాటి ముక్కగా కత్తిరిస్తే రబ్బరుతాడు వస్తుంది. దీన్ని బంతులకుకట్టి ఆడుకోవచ్చు.

నిప్పుకి, మనంతినే వస్తువుల దగ్గఱకిమాత్రం యీ రబ్బరును రానివ్వకండి!

ఆలోచించి అవసరాన్నిబట్టి యీ రబ్బరు ట్యూబుతోఅవసరమైనవి చేసుకోవచ్చును. ఆలోచించండి. మీకు కొత్తవి తెలుస్తాయి.

---

## గాంధీ పఠం :

ఒక బడికి ఒక ఇనస్పెక్టరుగారు వచ్చారు. "మాష్టరుగారూ! గాంధీగారినిగురించి పిల్లలకు ఏమి తెలుసునో ప్రశ్నలడగండి" అని బడి మేష్టారితో చెప్పారు.

మేష్టారు, గోడమీదవున్న గాంధీపఠంవైపు చూపుతూ: "పిల్లలూ! మీాకీ పఠమునుగురించి తెలుసుకదూ?" అని అడిగారు.

పిల్లలు : తెలుసునండీ.

ఇనస్పెక్టరు : ఏమి తెలుసునురా?

ఒక పిల్లవాడు : దీనిని మా మేష్టారు వీరాసామి కొట్లో అణాకికొని, వెంకటసామి కొట్లో 12 అ॥ పెట్టి పఠం కట్టించారండీ!

— యనమండ్ర సోమేశ్వరరావు (కాకినాడ)

# "మిక్స్చర్ మజా"

రచన : యస్. హెచ్. నరేశ్వర్

ఆదివారం సాయంకాలం కారపూస, బూందీ, పకోడీలు కలుసుకున్నాయి. అవి తీవ్రంగా ఏదో చర్చిస్తున్నాయి బీచిలో. చల్లగాలి హాయిగా ఊపుతున్నాది.

కారపూస :-బూందీ! నీకంటే అందరూ నన్నే ఎక్కువగా మెచ్చుకుంటారే!

బూందీ :-మెచ్చుకోవడ మేమిటి? తింటారను. నన్నుమాత్రం ఆరగించరా ఏమి? నీలాగ నేను సన్నంగా పొడుగ్గా వంకర టింకరగా వుండను. గుండ్రంగా ఎంచక్కగా వుంటా! అంచేతనే నన్ను ఆప్యాయంగా తింటారు.

పకోడీలు :-ఆకారాల మాట కొస్తే అనేక ఆకార అవతారము లెత్తగల శక్తి నాకొక్కదానికే వున్నాది. నేను దేముడితో సమానం. అంతే కాదు. నేను కోడి కాని కోడిని. నాలో జీవంవుంది.

కార :-నేనేం తీసిపోయేనా? నువ్వు కోడికాని కోడివయితే నేను పూసకాని పూసను. బాలిక లందరకూ పూస లంటే బలేఇష్టం.

బూందీ :-అలాగయితే-బూందీకి హిందీకి చాలాదగ్గర సంబంధం వుంది. ఇప్పుడు అందరికీ హిందీ ఎంత అవసరమో బూందీకూడా అంత ఇష్టం! అయినా ఏమిటే కారపూసా నీగొప్ప! మహా కోసేస్తున్నావు నాదగ్గర! బడిలో చదువుకుంటూ వున్న కుర్రాళ్ళంతా నిన్ను నిక్కరు జేబులో వేసుకుని తింటూ బడికి వెళ్తారు. ఒకప్పుడు క్లాసులో తింటే మేష్టారికి కోపంవచ్చి తింటూన్న కుర్రాణ్ణి కొడతారు కూడాను. ఎంత ద్రోహం! నీవల్ల వారు కూడా దెబ్బలు తినవలసి వస్తున్నాది.

కార :-అట్టే మాట్లాడకు. నిన్ను

తరచూ ఎవరింట్లోనూ చేసుకొని తినరని నీకు ఉడుకుమోత్తనం. చేసుకుంటూన్నవాళ్ళు నూటికొక్కరుంటారు. నన్నో! జంతికల రూపంలో చేసుకొని తిని ఆనందిస్తారు. దీనికి సాక్షి అందరింట్లోనూ జంతికల గొట్టం వుండడమే.

బూందీ :-నోరుముయ్యి! నీగొప్ప తెలిసిందిలే! కుర్రాళ్లు మరచిపోయి నిక్కరు జేబులో నిన్ను కొంచెం వుంచేస్తారు. ఆనిక్కర్లు చాకలాడికేసినప్పుడు చాకలాడు నీతో సహా నిక్కర్ని బాగా చాకలిబండమీద వుతుకుతాడు. చాలదూ ఆ అవమానమూ!

పకోడీలు :-నాకు ఈ బాధ లేమీ లేవు హాయిగా. నాకున్న రుచి మీకు వుందీ!

బూందీ :-నేను రెండు రుచులు చూపిస్తాను. వాటినే తియ్యబూందీ, కారపుబూందీ అని తినేవాళ్లు పిలుస్తారు. అందువల్ల నేను నవ్వుతున్న వాళ్లను ఏడిపించ గలను. ఏడుస్తున్న వాళ్లను నవ్వించగలను. అబ్బో! నా గొప్ప చెప్పాలంటే చాలా వుంది.

పకోడీలు :-మీ యిద్దరికంటే నన్నే ఎక్కువ తింటారు. నాతో వుల్లిపాయలను కూడా కలపబట్టి నేనెంతో రుచికరంగా వుంటాను. "నన్ను వర్ణింపగలడె శ్రీనాథుడైన"

కార :-నీ కవిత్వం కట్టిపెట్టి ఇలా విను. నిన్ను వుల్లిపాయలతో కలపబట్టే కొందరు చాదస్తులు అసలే ముట్టుకోరు. మమ్ములను అందరూ తింటారు. అదే మా గొప్ప. కాదంటే కారపు బూందీ!

పకోడీలు :-ఊరుకోండి. మీరు చిన్నవాళ్లు. మీకు లోకజ్ఞానం అసలేలేదు. ఉల్లిచేసిన మేలు తల్లి అయినా చేయదు. అటువంటి వుల్లిపాయ పకోడీ ఘనత చెప్పతరమా.?

కార :-ఎన్ని చెప్పండి నా గొప్ప మీకురాదు. నక్కెక్కడ దేవలోక మెక్కడ! నన్ను జేబులో పోసుకుని హాయిగా తింటూ తమాషాగా కబుర్లు చెప్పుకుంటూ

బడికి వెళ్తున్న బాలులకి తప్పు మీ కేం తెలుసూ నా మజా.

పకో :—మనం ఇలాగ అనవసరముగా దెబ్బలాడుకో వద్దని నాసలహా. మీ యిద్దరికన్న నేనే పెద్దదాన్ని కాబట్టి నే చెప్పేమాటలు కాస్త ఆలకించండి. మనం ఏదో ఒక ఒప్పందలకు రావడంమంచిది ఏం. ఏమంటారు!

కారబూందీ :—అలా అయితే ఒప్పుకుంటాము. నువ్వు మాకు మధ్యవర్తిగా వుండి తీర్పు చెప్పు. మా యిద్దరిలో ఎవరు గొప్పవారో న్యాయంగా తేల్చాలి. పక్షపాతం వుండకూడదు!

పకోడీ :—ఎవరు గొప్పవారైతే నేం? అందరం తినబడ్డానికే కదా సృష్టింప బడ్డాము. మనల నందరినీ కలిపి "మిక్స్చర్" తయారు చేస్తారన్నమాట మరవకండి. స్వతంత్రభారత దేశంలో అందరం సమానులం. ఒకరు గొప్ప ఒకరు బీదా లేదు. అదీగాక మనలను ప్రత్యేకంగా తినడానికన్న (మిక్స్చర్) కలిపి తినడంలో రుచి బాగా తెలుస్తుంది. ఈ విషయంలో అనుభవ పూర్వకంగా బాల మనకు సాక్షి. ఇలా మనం కలిసి వుండడమే మంచిది. అందుచేతే ఐకమత్యమే బలమన్నారు పెద్దలు. కావున మనం అందరం కలిసి "జై! మిక్స్చర్ కీజై!" అనిఅందాం.

జై! మిక్స్చర్ కీ జై!

## వ్యాసరచన:

**ఉపాధ్యాయుడు :** ఏమిరా సోమూ! తాటిచెట్టుమీద నీ వ్యాసరచన, రాము వ్యాసరచన ఒక్కమాదిరిగానే వున్నాయేమిరా?

**సోము:** అవునండీ! మేమిద్దరము ఒకే తాటిచెట్టునిగురించి వ్యాసం రాశామండి.

—యనమండ్రి సోమేశ్వరరావు (కాకినాడ)

# బెరపకురా బెడేవు!

రచన : వంకదారు సాత్యకిరావు, దోసపాడు (కృష్ణా)

చంద్రగిరి పట్టణంలో రామావధాని అను నొక బ్రాహ్మణుడు కలడు. అతనికి ఆపట్టణంలో జరుగక భార్యను వెంట దీసుకుని సత్యవాది పట్టణము జేరెను. అక్కడ ఒక మంచిరోజు చూచుకుని రాజుగారి దర్శనార్థమై వెళ్ళెను.

రాజగారీ బ్రాహ్మణుని జూచి "ఎవరవునీవని" యడిగెను. అప్పుడు బ్రాహ్మణుడు, రాజా! మాది చంద్రగిరి పట్టణము. మాకక్కడ జరుగక యేలినవారు ధర్మ పరిపాలన చేయుచున్నారని తెలిసి కుటుంబ సహితముగా తమ దర్శనార్థమై వచ్చితిమి. ఆపైన తవ చిత్తము అని బ్రాహ్మణుడ చెప్పెను. రాజుగారికి బ్రాహ్మణునిపై దయగలిగి నిత్యము ఎనిమిదిశేర్లు బియ్యము. రూపాయి బత్యము యివ్వమని షరబుకి ఆర్డరు వేసెను.

ఈ కొత్తగా వచ్చిన బ్రాహ్మ



ణుని జూచి పూర్వమునుంచి వుంటున్న బ్రాహ్మణులు అసూయపడ సాగిరి. ఎందుచేత ననగా యీ బ్రాహ్మణులకు రాజుగారిచ్చునది నిత్యము ఒక శేరు బియ్యము పావలా పైఖర్చే! ఇట్టా కొత్తగావచ్చిన బ్రాహ్మణుడు ఎనిమిది శేరుల బియ్యము రూపాయి బత్యము కాజేస్తున్నాడంటే అసూయగాక మరేమిటి!

ఒకరోజున బ్రాహ్మణుడు రాజుగారిదగ్గరకు వెళ్ళుచుండగా రాజుగారిమంగలిఎదురై 'బాబూ! నాకు బహుమాన మీయవలెనని' యడుగగా నేను ఇక్కడకు వచ్చినది కొత్త గనుక రాజుగారికెప్పుడనుగ్రహము వచ్చి నాకు బహుమతి ఇస్తే అప్పుడే దానిని నేను నీకిచ్చివేస్తాను అని బ్రాహ్మణుడు చెప్పెను.



బ్రాహ్మణు లందరూ కలసి రాజుగారియొద్దనున్న మంగలివాడు తలచుకొనినయెడల యీ కొత్త బ్రాహ్మణునికి ఉద్వాసన చెప్పవచ్చునని మంగలివానిని ప్రోత్సాహపెట్టిరి. ఒరేయి మంగలీ! మేమంతా కలసి వంద రూపాయిలు బహుమానమిస్తాము. మామాట విని యీ కాస్తపనిని చేసిపెట్టావంటే మా పీడ వదిలిపోతుంది. రేపు గ్రహణమునాడు రాజుగారు క్రొత్త బ్రాహ్మణుని వలన మంత్రోపదేశము పొందుతారు. అదిమొదలు నిత్యము మంత్రము వచ్చువరకు చెప్పించుకొందురు. యీలోగా నీవు రాజుగారికి క్షవరము చేయుచున్నప్పుడో లేక కాళ్ళు పట్టునప్పుడో కొత్తగా వచ్చిన బ్రాహ్మణుడు ఏలినవారి చెవి వాసన యని చెప్పుచున్నాడని చెప్పు. తరువాత బ్రాహ్మణునితో రాజుగారు నీనోరు వాసనయని చెప్పుచున్నారని చెప్పు. ఈ

ంగా బ్రాహ్మణులంతా మంగలివానిని ప్రోత్సాహ పరచిరి.

ఇంతలో గ్రహణమువచ్చెను. రాజుగారు క్రొత్త బ్రాహ్మణుని పిలిపించి మంత్రోపదేశము చేయమని యడుగగా 'చెరపకురా చెడేవు. ఉరకకురా పడేవు' అని బ్రాహ్మణుడు మంత్రోపదేశము చేసెను. అది మొదలు ప్రతీ రోజూ బ్రాహ్మణుడు యీవిధంగానే రాజుగారికి మంత్రోపదేశము చేయుచుండెను.

ఒకరోజున మంగలి రాజుగారి కాళ్ళుపట్టుచూ "మహాప్రభూ! క్రొత్తగావచ్చిన బ్రాహ్మణుడు తమచెవి వాసనయని పలువురుతో చెప్పుచుండగా వింటిని అని చెప్పెను. మరునాడు బ్రాహ్మణుని దగ్గిరకువచ్చి "బాబూ! రాజుగారు తమ నోరు వాసనయని నిన్న నాతో చెప్పినారు" అని బ్రాహ్మణునితో పల్కెను.

మరునాడు బ్రాహ్మణుడు రాజుగారికి మంత్రోపదేశము చేయుచు నోటిపై గుడ్డవేసుకొనెను. అప్పుడు రాజుగారు "నాచెవివాసన" యని కాబోలు యీబ్రాహ్మణుడు నోటిపై గుడ్డకప్పుకుని మంత్రోపదేశము చేయుచున్నాడని కోపించి గబగబా ఒకచీటీవ్రాసి బ్రాహ్మణుని చేతికిచ్చి యీ చీటీతీసుకునిపోయి మంత్రికిమ్మని చెప్పెను.



బ్రాహ్మణుకా చీటీ తీసుకుని పోవుచుండగా దారిలో మంగలెదురై "బాబూ! రాజుగారిచ్చిన బహుమానాన్ని నాకిస్తామన్నారు. ఆచీటీనిలా ఇవ్వండి" అంటూ మంగలి ఆచీటీని తీసుకుని షరాబుదగ్గరకు వెళ్ళెను. దానిలో యీవిధంగా వ్రాయబడివుండెను, "ఈచీటీ తెచ్చిన వాని తల నరుకుము. ఇది రాజాజ్ఞ" అని.

పరాబు వెంటనే తలారులను పిలిపించి మంగలివాని తల తీయుటకు సిద్ధపడెను. మంగలివాడు గొల్లున యేడ్చుకుంటూ రాజుగారికి ఫిర్యాదుచేసెను. అప్పుడు రాజుగారు "నీకీచీటీ ఎక్కడిది" అని మంగలివాని నడిగెను. మంగలివాడు. "మహాప్రభూ! కొత్త బ్రాహ్మణుడు తమదర్శనానికి వచ్చినప్పుడే నాకేమి బహుమతి ఇచ్చెదవని యడిగితిని. రాజుగారు ముందు నాకేమి బహుమతిచేసిన అది నీకిచ్చెదనని చెప్పినాడు, యీరోజున యీ చీటీపట్టుకుని పరాబుదగ్గిరకు వెళ్ళుచుండగా తమరేదో గొప్ప బహుమతి చేశారని ఆశపడి నేనాచీటీ తీసుకుని పరాబు దగ్గరకు వెళ్ళితిని. పరాబు నా తల నరికించుటకు సిద్ధపడ్డాడు. ఇదంతా బ్రాహ్మణు లందరూ కలిసి కొత్త బ్రాహ్మణునిమీద చేసిన కుట్రవలన జరిగింది. మీ చెవి వాసనయని; ఆయన నోరు వాసనయని ఇద్దరకూ తగాదా పుట్టినట్లయితే మీరు బ్రాహ్మణుని శిక్షించెదరు. అప్పుడు నాకు యీ బ్రాహ్మణు లందరూ కలసి పెద్ద బహుమతి చేస్తామని చెప్పినారు. అందుచేత నేనీవిధంగా మీ ఇద్దరకు చెప్పాను. ఇది జరిగిన సంగతి" అని మంగలి చెప్పెను.

అప్పుడు రాజుగారు బ్రాహ్మణుని చెరపబోయిన నీవే చెడితివి. మొదట్లోనే నాకీబ్రాహ్మణుడు "చెరపకురా చెడేవు" అని మంత్రోపదేశము చేశాడు. అని చెప్పి మంగలిని రక్షించెను. తరువాత యీ కుట్ర చేసిన బ్రాహ్మణుల నందరినీ పిలిపించి తన రాజ్యమునుంచి వెడలగొట్టించెను. అంతటితో కథ కంచికి, మనమింటికి.

## ఎవరు ఫూల్? * * *

గోపు, వేణు ఎనిమీస్. ఇద్దరూ ఒక ఇరుకు సందులోంచి ఎదురుగా వస్తారు.

గోపు:-నేను ఫూల్సుకి త్రోవ ఇవ్వను.

వేణు -నేను ఇస్తాలే. (అంటూ ప్రక్కకు తప్పుకుంటాడు.)

—వి. వి. కె. హమోన్ రావు (అవనిగడ్డ)

# బాబు - లిల్లి

రచన : ధన్వాడ సుబ్బారావు

పూర్వము ఒకవూళ్లో బాబు అనే పిల్లవాడు ఉండేవాడు. వాడు ఒక యోగిదగ్గర శుశ్రూష చేసాడు. వాడి భక్తికిమెచ్చి ఆయోగి బాబుకి ఒక పండు యిచ్చి, దాన్నితింటే ప్రపంచములో సాధారణ మనుష్యులకు తెలియని రహస్యాలన్నీ తెలుసుకోవచ్చు, అని చెప్పాడు. బాబు చాలా సంతోషంతో ఆపండును తీసుకొని తినేశాడు. ఒక దీవిలో అప్పుడే మూడు అద్భుతమైన కుక్కపిల్లలు పుట్టాయని తెలుసుకొన్నాడు. వాటిలో ఒక తెల్లటి కుక్కపిల్ల ఉంది. ఆ కుక్కపిల్లని ఎల్లాగైనా సంపాదించాలని అనుకున్నాడు. కాని బాబుకి సహాయంచేసేవాళ్లు కావద్దూ? అందుచేత తనతో ఆకుక్కపిల్ల తేవడానికి ఎవరన్నా వస్తారేమోనని వెదుకుతూ బయల్దేరాడు.

అల్లా వెళ్లగా, వెళ్లగా ఒకడు కనుపించాడు. బాబు వాడిని, "నీపేరేమిటి?" అని అడిగాడు. అప్పుడు వాడు, "నేను మంచి విలుకాడిని. పరుగెత్తుతున్న లేడి యొక్క ఏభాగాన్ని కొట్టమన్నా సరిగ్గా కొట్టగలను." అని చెప్పాడు. బాబు "నీవు నాతో కుక్కపిల్లని తీసుకు రావడానికి వస్తావా?" అని అడిగాడు. విలుకాడు "సరే" అని బాబుతో బయల్దేరాడు.

వాళ్లిద్దరు కొంచెం దూరం వెళ్లగానే ఇంకొకడు కనుపించాడు. వాడిని బాబు, నీవు ఏం చేస్తావు? అని అడిగాడు, వాడు "నాపేరు సర్వకర్ణుడు. నేను బాగా వినగలను. గడ్డిపెరగడం కూడా నేను వినగలను." అన్నాడు. బాబు, అయితే నాతో కుక్కపిల్లని తేవడానికి వస్తావా"? అని అడిగాడు. వాడు తప్పకుండా వస్తాను అని బాబుతో బయల్దేరాడు.

వీళ్లు ముగ్గురు వెళ్తూండగా మరియొకడు కనుపించాడు. బాబు వాడిని, "నీపని ఏమిటి"? అని

అడిగాడు. అప్పుడు వాడు, నేను చతురగమనుడను. పక్కవాళ్లకు తెలియకుండా సంచరించగలను. కుక్కనోట్లో ఉన్న ఎముకముక్కలోని మాంసాన్ని కూడా కుక్కకి తెలియకుండా తీసుకురాగలను అన్నాడు. బాబు నీవు కుక్కపిల్లని తీసుకొని రావడములో నాకు సహాయం చేస్తావా? అని అడిగాడు. అందుకు తప్పకుండా వస్తాను, అని చెప్పి బాబు వెంట నడిచాడు.

వీళ్లందరు నడుస్తూండగా కొంచెందూరం వెళ్లేటప్పటికి ఇంకొకడు ఎదురుపడ్డాడు. బాబు వాడిని వాడివృత్తి అడుగగా వాడు, నేను పడవలుచేసే వాడిని. ఒక్కరాత్రిలో సముద్రంలో వేగంగా పోయే పడవని చెయ్యగలను అని జవాబు చెప్పాడు. వాడుకూడా బాబుతో వెళ్లడానికి యిష్టపడి బాబుతోటి వెళ్లాడు.

బాబు మరికొంచెం దూరం వెళ్లేటప్పటికి ఇంకొకడు కనిపించాడు. వాడినికూడా బాబు, నీవు ఏంచేస్తావు? అని అడిగాడు. వాడు, నన్ను తాడిగాడు అంటారు. ఎంత నున్నని గోడనైనా సులభంగా ఎక్కయ్యగలను, అని చెప్పాడు. వాడుకూడా బాబుతో వెళ్లడానికి యిష్టపడి వాళ్లవెంట బయల్దేరాడు.

ఇల్లా వాళ్లారుగురు నడుస్తూ చీకటిపడేటప్పటికి ఒక సముద్రతీరాన్ని చేరుకున్నారు. అప్పుడు బాబు తాను తెచ్చుకున్న ఆహారం అందరకుపెట్టి తను తిన్నాడు. తర్వాత పడవలవాడిని పిలిచి, నీవు ఈరాత్రి అంతా పనిచేసి తెల్లవారేటప్పటికి ఒక తోలుపడవని తయారుచెయ్యి, అందులో మన ఆరుగురికే కాకుండా మరికొందరికి కూడా స్థలము ఉండాలి. అని చెప్పాడు. వాడు రాత్రిఅంతా కష్టపడి, తెల్లవారేటప్పటికి, చాలా తేలిక అయినది, వేగంగా పోయేది, ఒకపడవ చేసాడు.

అప్పుడు వాళ్లందరు ఆపడవలో ఎక్కి సముద్రంలో ప్రయాణము మొదలుపెట్టారు. బాబు పడవలవాడితో పశ్చిమానికి వెళ్లమని చెప్పాడు. వాళ్లు అల్లా పశ్చిమానికి ఆరురోజులు ప్రయాణంచేసి ఏడోరోజు ప్రొద్దున్నకి


ద్వీపము దగ్గరికి వచ్చారు.
ళ్లు ఆద్వీపము దగ్గరపడవని
అక్కడ దిగారు. అందులో
పెద్దకోట ఉంది. ఆకోటలో
పెద్ద రాక్షసుడు నివసించే
డు. బాబు సర్వకర్ణుడిని పిలిచి,
నీకు ఏం వినిపిస్తోంది?''
అడిగాడు. అప్పుడు
ర్వకర్ణుడు, ''నాకు పెద్దగుఱ్ఱు
పిస్తోంది. రాక్షసుడు నిద్ర
తున్నాడేమో! అని అన్నాడు.
ప్పుడు బాబు తాడిగాడిని
చి, నీవు యీకోట గోడెక్కి
పల ఏం జరుగుతుందో చూడ
న్నాడు. వాడు చూసివచ్చి,
క్షసుడు నిద్రపోతున్నాడు.
డి దగ్గరగానే యిద్దరు చిన్న
జకుమారులు ఆడుకుంటున్నా
రు. ఒకచిన్న రాజకుమార్తె
రాక్షసుడి అరచేతిలో నిద్రపో
తూంది. రాక్షసుడు కాలిదగ్గర
ఒకపెద్ద ఆడకుక్క పడుకుని నిద్ర
పోతూంది. దానిప్రక్కనే మూడు
కుక్కపిల్లలు ఉన్నాయి. అం
దులో ఒకకుక్కపిల్ల తెల్లగా
ఎంతో అందంగా ఉంది అని
తాను చూసిన సంగతులన్నీ
కూడా పూసగ్రుచ్చినట్లు చెప్పా
డు. బాబు వాడితో, నీవు చతు
రగమనుడిని వీపుమీద ఎక్కించు
కొని కోటలోపల దింపు. వాడు,
రాజకుమారులను, రాజకుమా
ర్తెను, మూడు కుక్కపిల్లలను
తీసికొన్న తరువాత వారిని,
వాడిని బయటకు జాగ్రత్తగా
దింపు అని చెప్పాడు. వాడు



బాబు చెప్పినట్లే చేసాడు.

అప్పుడు బాబు, " రాక్షసుడు నిద్రలేచే లోపుగా మనము పిల్లందరినీ తీసికొని వెళ్లిపోవాలి. అని చెప్పి త్వరగా అందరితో కలిసి పడవలో ఎక్కాడు. వెంటనే పడవలవాడు తూర్పుదిశకు పడవను నడిపాడు. అల్లా వాళ్లు చాలాదూరం వెళ్లిన తరువాత బాబు సర్పకర్ణుడితో, నీకు ఏం వినిపిస్తోంది? అని అడిగాడు. వాడు జాగ్రత్తగావిని, ఆడకుక్క నిద్రలేచి పిల్లలకోసం అరుస్తోంది అన్నాడు. బాబు పడవలవాడిని పడవ వేగంగా నడపమని చెప్పి, సర్పకర్ణుడుని మళ్లీ ఏం వినిపిస్తోందో చెప్పమన్నాడు. వాడు విని, రాక్షసుడుకూడా నిద్రలేచాడు. కుక్కతో, మనని తరుమమని చెప్తున్నాడు. అన్నాడు. బాబు పడవలవాడితో యింకా వేగంగా పొమ్మని చెప్పి, వెనక్కి చూసేలోపల ఆడకుక్క వాళ్లని సముద్రంలో తరుముకు రావడం కనుపించింది. అది సమీపంలోకి రాగానే, తెల్లకుక్కపిల్లను కాక, మిగత రెండింటిలో ఒకదానిని ఆకుక్కవైపు విసిరాడు. అది ఆ కుక్కపిల్లని నోటకరుచుకొని శర వేగంతో వెనక్కి వెళ్లిపోయింది. బాబు పడవలవాడితో వేగం హెచ్చించమని చెప్పేలోపల ఆడకుక్క మళ్లీ యీదుకుంటూ వచ్చేసింది. వెంటనే బాబు తెల్ల కుక్కపిల్లను కాకుండా యింకో దాన్ని విసురుతాడు. దాన్ని కరచుకొని కుక్క ద్వీపంవైపు వెళ్లిపోయింది. బాబు మళ్లి సర్ప కర్ణుడిని, నీకిప్పుడేం వినిపిస్తోంది? అని అడిగాడు. అప్పుడు వాడు, కుక్క అలసిపోయి ఒగర్చుతూంది. రాక్షసుడు దాన్ని మళ్లీ మనని తరుమమని ప్రోత్సాహిస్తున్నాడు. అది రావడంలేదు. అని చెప్పాడు. మళ్లీ కొంచెంసేపు విని, రాక్షసుడే మనని తరుమడానికి బయల్దేరాడు అని చెప్పాడు. బాబు పడవలవాడిని చాలా వేగంగా పొమ్మని హెచ్చరించాడు.

రాక్షసుడు చాలా పొడుగుగాను, లావుగాను ఉన్నాడు. వాడికి సముద్రము మోకాలు లోతు కూడా రాలేదు. వాడికి ఒక్కటే చెయ్యి ఒక్కటేకన్ను వాడు ఎంతో త్వరగా బాబు



పడవదగ్గరికి వచ్చేసాడు. అప్పుడు బాబు విలుకాడితో ఆరాక్షసుడి అరచేతిలో నల్లటి మచ్చ కనబడుతూంది కదూ! దానిమీద సరిగ్గా గ్రుచ్చుకొనేటట్లు బాణమువెయ్యి అని చెప్పాడు. విలుకాడు వేసిన బాణం వెళ్లి సరిగ్గా ఆమచ్చమీద కొడితేనే దెబ్బతగులుతుంది. అదే వాడి ఆయువుపట్టుకూడాను. శరీరంలో యింకఏభాగంలో కొట్టినా వాడికి ఏమీ అవదు. ఆమచ్చ యితరులకు కనబడకుండా వాడు రాజకుమారిని అరచేతిలో పెట్టుకొని ఉడుకొనేవాడు. కాని అవిలుకాడిబాణం ఆమచ్చమీద గ్రుచ్చుకోంగానే వాడు ఉరుములు ఉరిమినట్లు అరుస్తూ చచ్చి ఆ సముద్రంలో పడ్డాడు.

బాబు కులాసాగా తనఊరు జేరుకున్నాడు. వెంటనే తన ఊరు రాజువద్దకు వెళ్లి రాజకుమారిని, రాజకుమారులను యిచ్చాడు. రాజు, రాణి తమ పిల్లలనుచూసి ఎంతో సంతోషించారు. రాజు బాబుతో, ఈపిల్లలు తోటలో ఆడుకుంటూన్నప్పుడు ఒక రాక్షసుడు ఎత్తుకొని పోయాడు. మేము మాపిల్లలిని తిరిగి చూడలేమని ఎంతో విచారించాం. నీవల్ల మాపిల్లలు

మాకు దక్కారు, అని చెప్పి ఎంతో కొనియాడాడు. రాజు బాబుని ఎంతో ఆదరించి మంచి బహుమతులిచ్చి పంపాడు.

బాబు ఆ బహుమతులలో కొన్నిటినితనకు సహాయపడిన అయిదుగురికి యిచ్చాడు. బాబు తాను తెచ్చుకున్న కుక్కపిల్లకు 'లిల్లీ' అని పేరుపెట్టుకొని ఎంతో ముద్దుగా పెంచుకున్నాడు. ఆ కుక్కపిల్ల పెద్దదై వేటల్లోను, యుద్ధాల్లోను బాబుకి ఎంతోసహాయం చేసింది. ఎన్నోసార్లు బాబు ప్రాణాన్నికూడా కాపాడింది.

# VINత WALKయాలు

PILLలలారా! ఈ WALKయాలు చదONEడి.

1. ONధ్ర RAWSTRAWనికై ONధ్రులంతా యేకMY యేక త్రాటిPIE నడWALLసిందని ఆచార్య RUNగా గారు సెల WHICHచారు.
2. అHIMSAW తత్వంలో నమ్మCOME ఉంచి THEYశంలో శాంతికోSOME పాటుపడాలంTOO GONEధీ మహాత్ముడు ఆTHEY SINచాడు.
3. SUNతలో ONEకాయలు TENకాయలు GUMపలలో పెట్టి WICKర యుంచెదరు.
4. INటికి దగ్గరగా PENట కుప్పలు ఉంచుట అనాROGUEయ కరము.
5. కాSEE పట్టణము GUNగా నTHEE తీరమునగలదు.
6. గTHINచిన దానికి CHINతించిన LAWభం LAYదు.
7. WARతా పత్రికలు చదివిన WARకి WIGయానము కలుగును.
8. WONకాయ ముక్కలుకోసి CHINతపండు PULLసుLOW ఉడికించి MENతులతోను ఆWALLతోను POPE పెట్టిన రుచిగా యుండును.

కూర్పు: భాగవతుల జగన్నాథం

# పరీక్ష

రచన: తా. తా. వు. రమణమూర్తి
(విజయనగరం)

వీరబల్ అక్బరు సంస్థానాస్థాన హాస్యగాడు, యుక్తిపరుడు. అతడు అనేకులైన ప్రజల్ని, అక్బరు చక్రవర్తిగారిని కూడా నవ్విస్తూ ఉండేవాడు. అక్బరు అతని సమయస్ఫూర్తికి మెచ్చుకుని చాలా బాగా గౌరవిస్తూండేవాడు. ఈవిషయం మిగతా మహమ్మదీయులకు కన్నెర్రగా ఉండేది. 'హిందువుడు మహమ్మదీయునివద్ద ఎక్కువ గౌరవం పొందడమా?' అని.

ఒకనాడు మహమ్మదీయులంతా అక్బరుతో 'ప్రభూ! ఏ మహమ్మదీయ హాస్యగాడూ లభించలేనట్టు, తమరు హిందూ హాస్యగానిని గౌరవిస్తున్నారు. మన మహమ్మదీయులలోనే ఒక ఘనమైన యుక్తిపరుడున్నాడు, అతడు వీరబల్‌ను మించేస్తాడు. మీకు నమ్మిక లేకపోతే 'పరీక్ష' చేయండి!' అన్నారు.

అక్బరు అంగీకరించాడు. ఇద్దరికీ 'పరీక్ష' చేస్తున్నట్లు తన రాజ్యంలో చాటింపు వేశాడు. సర్వప్రజ 'పరీక్ష' చూడ్డానికి వచ్చారు. అక్బరు చక్రవర్తి ప్రశ్నించాడు.

'ఏమోయ్! ప్రస్తుతం ఈ సభికుల మనస్సులో ఏముందో చెప్పు?' అని, మహమ్మదీయ యుక్తిపరుణ్ణి ప్రశ్నించాడు.

మహమ్మదీయ హాస్యగానికి కాళ్లూ, చేతులూ ఆడక మొహం తేలవేసి తెలీదని వప్పేసుకున్నాడు.

'ఏమోయ్! వీర్బల్! నీవు చెప్పు!' అన్నాడు చక్రవర్తి. 'తమరు ఆయురారోగ్యాలతోను, సర్వసౌఖ్యంగా రాజ్యాన్ని పాలించాలని ఉంది!' అన్నాడు వీరబల్.

నిజమేనా? అక్బరు అన్నాడు.

'కాదని ఎవరిచేతనైనా అనిపించండి!' వీరబల్ అన్నాడు.

ఎవరు కాదంటారు? రాజాగారి సౌఖ్యం కోరరూ? కోరక పోయినా వారి అభిప్రాయం వెల్లడి చేయలేరుకదా! అంచేత ఊరుకున్నారు. వీరబల్ యుక్తికంతా మెచ్చుకున్నారు.




రచన: "ప్రేమ్ జీవ్"


అనగనగా ఒక ఊళ్లో ఒక వర్తకుడున్నాడు. ఆవర్తకుడి ఇల్లు ఊరిబయటగా వుంది. ప్రతి రోజూ ఆవర్తకుడు అక్కడికి రెండుమైళ్ల దూరాన వున్న ఒక పట్టణానికి తనసరకులు తీసుకు వెళ్లి అమ్ముకొస్తూ వుండేవాడు.

ఒకనాడు ఇలాగే వెళ్లి తిరిగి వచ్చే సమయానికి పెద్ద గాలీ వానా వచ్చింది. వాన వెలియగానే బయలుదేరి వెళ్దామని అక్కడే ఆగిపోయాడు వర్తకుడు.

వాన జోరుగా కురుస్తోంది. రాత్రి 9 గం॥ అవుతుంది. ఒక దొంగ వర్తకుడి ఇంటిదగ్గరకి వచ్చాడు. వర్తకుడు లేడు. ఇంటికి తాళం వేసివుంది. అంతా చీకటి. జనం ఎవరూ తిరగటం లేదు. ఇదే మంచి సమయం అనుకున్నాడు. ఇంటికి కన్నం వేశాడు. లోపలికి ప్రవేశించాడు. ఇంట్లోవున్న డబ్బు, బంగారం అంతా మూటకట్టుకుని తలుపు తీసి వర్షంలోనే ఇంటికి పారిపోయాడు.

కొంతసేపటికి వర్షం తగ్గిపోయింది. వెన్నెల వచ్చింది. వర్తకుడు ఇంటికి బయలు దేరాడు.

ఈలోపున వర్తకుడి ఇంటివేపు ఇంకోదొంగ పోతున్నాడు. వర్తకుడి ఇంటి తలుపులు తీసివున్నాయి. ఇంటిదగ్గరకి వెళ్ళిచూసాడు. లోపల ఎవరూ మనుష్యులు వున్నట్టులేదు. లోపలికి వెళ్ళిచూసాడు. నిజంగా యింట్లో ఎవరూలేరు. దొంగ, తన పంట పండిందనుకున్నాడు. ఇల్లంతా వెతకటం మొదలు పెట్టాడు.



తోచింది. దొంగని పట్టుకునేందుకు, బయటకివచ్చి తలుపులకు బయట గొళ్ళెం పెట్టాడు. దొడ్డివేపుకు వెళ్ళి దొడ్డితలుపు బయటగొళ్ళెంపెట్టాడు. ఇంక దొంగ బయటికి పారిపోలేదు.

వర్తకుడు రాజభటుల దగ్గరకివెళ్ళి దొంగసంగతి చెప్పాడు. వారు వర్తకుడివెంట వచ్చారు. దొంగని పట్టుకునేందుకు తలుపుతీసి దొంగను పట్టుకున్నారు.

కానీ డబ్బు ఏమీ కనిపించలేదు. కానీ దొంగ నిరాశ చెందలేదు. వర్తకుడు డబ్బు ఎక్కడో పాతేసి వుంటాడని తవ్వటం మొదలు పెట్టాడు.

ఇంతలో వర్తకుడు ఇంటికి చేరుకున్నాడు. తలుపులు తీసి వుండేటప్పటికి ఎవరో దొంగ ఇంట్లో ప్రవేసించి యుంటాడని అనుమానం కలిగింది. మెల్లిగా లోపలికిపోయి చూసాడు. దొంగ పొయ్యిదగ్గర త్రవ్వు తున్నాడు. వర్తకునికి ఒక ఉపాయం



వర్తకుడు ఇల్లంతా వెతి
ాడు. డబ్బు బంగారం కనిపించ
ేదు. అవి పోయాయని భటు
లతో చెప్పాడు. వారు దొంగని
డిగారు ఎక్కడ దాచాడో
సుకురమ్మని.

దొంగ నేనేమీ ఎత్తుకుపోలే
న్నాడు. నిజానికి ఈ దొంగ
మీ ఎత్తుకుపోనేలేదు. మొదటి
ొంగ అన్నీ ఎత్తుకు పోయాడు.
కారంమాత్రం ఏమీ దొంగలిం
కని దొంగమీద పడ్డది.

దొంగని రాజుదగ్గరకి తీసుకు వెళ్ళారు. రాజు విచారించి దొంగకి 3 సంవత్సరాలు కఠినశిక్షవిధించాడు. చూశావా బాలా! దొంగతనం చేయక పోయినా ఈ రెండో దొంగకి దొంగ వుద్దేశం వుంది గనుక శిక్ష పడింది. దొంగవుద్దేశంకూడా ఒక నేరమే తెలుసా? అంచేత దొంగ పిల్లలతో సహవాసం చేస్తే మనం కూడా చిక్కుల్లో పడతాం! జాగ్రత!

మీ బిడ్డ లివర్ అండ్ స్ప్లీను వ్యాధిచే
బాధపడుచున్న యెడల వెంటనే
పాత్రుడుగారి
బాలసంజీవిని
యీయండి.
ఇతర మందులన్నిటికన్న ఇది ప్రశస్తమని మీకే తెలియగలదు.
వివరములకు:
డా॥ పిళ్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదరు,
11 దక్షిణమాడావీధి, మైలాపూరు, మదరాసు,

కుంభకోణం బ్రాంచి;
నెం. 7, సారంగపాణి కోవిల్
తూర్పువీధి.

తిరుచినాపల్లి బ్రాంచి;
నెం. 15, పుగళైపిళ్ళే వీధి,
తెప్పకొలం




గొట్టిపాముల సిద్ధేశ్వర్ (శివరాంపల్లి)

బాలలూ!

భీముడి పేరు మీరు వినే వుంటారు. పంచ పాండవులలో ఒకడు. భీముడు చాలా లావుగా వుంటాడు. బలవంతుడు, దుడుకుతనం, జబర్దస్తీ, మొరటుతనం - ఇవన్నీ భీముని గుణాలు. కాని ఈ కథలో మీరు ఆభీముడే సత్యాగ్రహం ఎలా చేశాడో ఒక గమ్మత్తయిన కథ వుంది. మన గాంధీతాతకు పూర్వమే ఈ సత్యాగ్రహం భీముడు చేశాడు. ఇక కథ చదవండి.

ఒకనాడు పాండవులు ఏదో ఓపండుగ చేసుకున్నారు. ఆనాడు ఆత్మబాంధవుడైన కృష్ణపరమాత్మని భోజనానికి పిలువాలని ధర్మరాజు నిశ్చయించుకుని అనేక విధములైన కమ్మని వంటలను తయారు చేయించాడు. పనుల వొత్తిడివల్ల ఈసంగతి మొదలే శ్రీకృష్ణునికి తెలుపలేక పోయాడు. "మన బావేగా! మొదలే చెప్పలేదని అనుకుంటాడా; అలుగుతాడా" అని అనుకున్నాడు ధర్మరాజు. వంటలన్ని సిద్ధమైనాయి. భోంచేసే వేళగూడ సమీపించింది. అప్పుడు ధర్మరాజు అర్జునుని పిలచి-

"అర్జునా! బావకు నీవు అతి ప్రియమైన వాడవు. బావదగ్గరకు వెళ్లి తొందరగ భోజనానికి పిలుచుకురా?" అని పంపినాడు.

శ్రీకృష్ణుడు సర్వాంతర్యామి కాబట్టి ఈసంగతంతా తెలుసుకున్నాడు. పాండవులలో నాకొరకెవరైన ప్రాణమివ్వడానికి సిద్ధమవుతారా పరిశీంచాలను

కొన్నాడు. అన్నయ్య ఆజ్ఞను పుచ్చుకొని అర్జునుడు బైలుదేరాడు. శ్రీకృష్ణుని యింటిని సమీపించి ఇంటి గుమ్మంలో నుండే 'ఏమోయి బావా! ఏం చేస్తున్నావు' అనుకుంటు లోపల ప్రవేశించినాడు. శ్రీ కృష్ణుడు శరీరంనిండ కప్పుకొని మంచంపై పడుకున్నాడు. అర్జునుడు అది చూచి, సమీపించి బావా! పండుకున్నావేం. లే! అన్నయ్య నిన్ను భోజనానికి రమ్మన్నాడు. భోజనానికన్నీ సిద్ధమైనాయి. నీ కొరకందరు వేచియున్నారు. అన్నాడు. శ్రీ కృష్ణుడు నిద్ర మేలుకుని - ఈవేళ విశేషమేముంది నాయనా! అని కండ్లు నిమురుకొంటు అన్నాడు.

ఈవేళ పండుగ చేసుకున్నాం బావా! మొదటే చెప్పాలంటే తీరికలేక పోయింది, అని మంచం కర్రపై కూర్చుంటు అర్జునుకు సమాధానం చెప్పాడు.

అయితే సంతోషమే, కాని నాపొట్టలో నొప్పిగవుంది. నేను రాజాలను, మీరందరు భోంచేసు



కొండి అని అన్నాడు పరమాత్ముడు.

శ్రీ కృష్ణుడు నన్ను అమితముగ ప్రేమించుతాడనే గర్వం అర్జునకుండేది. ఆ ధీమాతోనే బావానీవు అలిగితే బ్రతిమాలడానికి రాలేదు నేను. వస్తావా తొందరగ నడువు. లేకపోతే నీయిష్టం. అని దర్జాగాఅన్నాడు.

"లేనోయ్! పొట్టలో నొప్పివుంది కాబట్టి రానన్నాను, మరేమి వేరె తలచవద్దు" అని కృష్ణుడు మూలుగుతు సమాధానం చెప్పాడు.

"అయితే నీయిష్టం. నే వెళ్లుతున్నా"నని అర్జునుడు వెళ్లిపోయాడు.

కృష్ణుడు రానన్నాడను సంగతివిని ధర్మరాజు మనస్సులో అశాంతి కలిగింది. ఏవిధంగనైన పరమాత్ముని తీసుకరావాలని, ఆయన రానిదే భోంచేయగూడదని ధర్మరాజు నిశ్చయించుకుని, ఎవరిని పంపాలా అని ఆలోచనలో బడ్డాడు. అన్నయ్య ఆలోచనను గుర్తించి నేనువెళ్తానన్నాడు నకులుడు. సరేనని శెలవిచ్చాడు. నకులుడు శ్రీ కృష్ణునిదగ్గరకు వెళ్లి బ్రతిమాలాడు కాని, ఎన్నో తియ్యని మాటలు జెప్పివచ్చిన దోవనే సాగనంపాడు. సహదేవుడుగూడ వెళ్ళొచ్చాడు. లాభం లేకపోయింది. ఇగ మిగిలింది ఒక భీముడు. భీమన్న చాల ఆలోచించి చిట్టచివరకు ఒక నిర్ణయానికొచ్చి:

అన్నయ్యా! నేను వెళ్లి రానా? అడిగాడు. అదివిని అందరు పక పక నవ్వసాగారు. అతి ప్రియుడైన అర్జునలాంటివారు వెళ్లితేనే రాలేని కృష్ణుని ఈ మొరటువాడు వెళ్లి తీసుకొచ్చేస్తాడా అని అందరు అనుకున్నారు, అర్జునుడు ముందుకొచ్చి హేళనగ:

ఏమయ్యా! స్వర్గంలోనుండి ఐరావతాన్ని లాగుకొచ్చిన మాదిరి లాక్కొస్తావా? లేక, వస్తేసరి లేకపోతే ఈ గదతో నీబుర్ర పగులకొడతానని భయపెట్టి నెట్టుకొస్తావా బావను అని అడిగాడు.

ఏమర్రా ఎందుకు నవ్వుతున్నారు. మీరందరు వెళ్ళొచ్చారు. మీచేత కాలేదు. భీమునిగూడ పంపి చూద్దాము. మీరు వానిని ఎందుకు హేళన

చేస్తున్నారు? అని తమ్ములను మందలించి భీముని వైపుకు మరలి భీమా! వీరిమాటలను లక్షించకు. వెళ్లి బావను ఏవిధంగనైన తీసుకురా అని ధర్మరాజు ధైర్యం చెప్పిపంపాడు.

మనభీమన్న గదను బుజంపై వేసుకుని ఏనుగ నడకతో బైలుదేరాడు. శ్రీ కృష్ణుడుగూడ ఇక భీమన్న చేరుకుంటాడని వూహించి ఆయనను మెప్పించడానికి సులువుగావాలని నొసటికి బాగ సొంటిగంధం రాసుకొని గట్టిగా మూలుగుతు ఒంటినిండ కప్పుకొని పండుకున్నాడు. ఇంతలో మన భీమన్నగూడ చేరుకొని:

ఏంబావ! మాదీనులపై నీకు దయకూడలేక పోయిందా? ఇంత వరకు ఎవరు భోంచేయలేదు. నీవొస్తేగాని భోజనాలు జరుగవు. కద! అంతగా అలసటగా ఉంటే నాభుజములపై ఎక్కించుకొని తీసుకెళ్లుతా. అని ఎంతో నమ్రతతో బతిమాలాడు.

కృష్ణుడు మొగముపైని శాలువనుతీసి ఏమర్రా మీకు పిచ్చెత్తిందా ఈనాడు? అగుపడటంలేదు నేనేంస్థితిలో నున్నది! ఈ బాధతో నేనెలా రావాలి. నా కొరకు లేచివుండ నవసరంలేదు. వెళ్లి భోంచేసుకొండి అని పైకి కోపం తెచ్చుకొని అన్నాడు.

ఎంతో బతిమాలి, వేసారి ఆఖరుకు నిరాశతో బైలుదేరాడు భీముడు. కాని, ఇంటిదోవ పట్టలేదు. కృష్ణుని ఇంటిప్రక్కనే తోటలో ఒక శివమందిరం ఉంది. అందులో ప్రవేశించి తలుపులు బెట్టుకొని శివలింగమును కౌగలించుకొని వెక్కెక్కిపడి ఏడువ




సాగాడు భీముడు. కృష్ణుడు రాకపోతే ఈ మహాదేవుని మూర్తి ఎదుట ప్రాణాలైన ఇస్తానుగాని ఇంటికి వెళ్లను అని నిశ్చయించుకుని, సత్యాగ్రహం మొదలు పెట్టాడు.

పరమాత్ముడు శ్రీ కృష్ణుడు సంగతంతా తెలుసుకొని లోలోపల ఎంతో సంతోష పడ్డాడు. భీమన్న సత్యాగ్రహానికి తలొగ్గాడు. నవ్వుతూ ఆగుడిదగ్గరకు వచ్చితలుపులు వెనుకకునెట్టాడు, తలుపులు తెరువబడ్డాయి. శివలింగమును అలుముకొని ఏడుస్తున్న భీముడు అగుపడ్డాడు. భీముడ్ని సమీపించి చేతితో వీపును తట్టుతూ:

గదపోటుతో ఎందరినో ఏడ్పించిన, నీవేనా ఏడ్చేది? భీమా! వూరుకో. నాస్థితి ఎలా వున్నా నీసమాధానం కొరకైన వస్తానులే! ఇకనైన వూరుకోమని కృష్ణుడు అన్నాడు.

అదివిన్న భీమన్న ఆనందానికి అంతేలేదు. కృష్ణుడ్ని బిగ్గరగ కౌగలించుకున్నాడు. చెయ్యి పుచ్చుకొని ఇంటికి తీసుకొచ్చాడు. శ్రీ కృష్ణుడు రావటంచూసి





జిల్లా కలెక్టరు కొడుకు: "మా నాన్న I. C. S."

వంటవాడి కొడుకు: మా నాన్నకూడా I. C. S. యే!

ధర్మరాజుకు చాల సంతోషం కలిగింది.

ఎంత మోసగాడవు బావా! నే నొచ్చినప్పుడు నీకు రావటం యిష్టంకాలేదా? అని అర్జునుడు అడిగాడు.

నేనెందుకు రాలేదో మీరే గ్రహించుకోండి! అన్నాడు కృష్ణుడు. కృష్ణుడు ఎంత దగ్గర చుట్టం, ఎంత బావ అయినా అంత చులకనగా చూస్తేవస్తాడా?




రచన : గోలి కేశవరావు (వడ్లమూరు)

బాలా! "కలవాట్లు" అంటే తెలుసా? కలలో చేసే అలవాట్లు కలవాట్లు! మనం నిద్రలో కలలు కంటాం. కలల్లో పలవరిస్తాం కూడాను. కొందరు నిద్రలో ఏదో కలగని, ఆ నిద్రలోనే తెలియకుండా లేచి నడుస్తారు. కొంతమంది అట్లాపోయి, ఏ చెరువులోనో, ఏ నదిలోనో పడి చనిపోయారు. అప్పటి వరకును వారికి మెలుకువరాదు! అది ఒక గొప్పజబ్బు. ఆజబ్బు ఉండటంవల్ల ఏమి జరిగిందో ఒకనిజమైన కథ చెప్తాను వినండి.

ఒకప్పుడు ఇంగ్లాండులో ఒక దొరగారు ఉండేవారట. ఆయనకు కోట్లు అంటే బలేసరదా. అంచేత ఆయన ఒకనాడు ఒక మంచి కోటును కుట్టించకుని, పగలు అస్తమానూ తిరిగి, రాత్రి అయినా దానిని విప్పకుండా పరున్నాడట. ఆ మరునాడు ఆయన లేచి చూచేసరికి, కోటు లేదట! ఆ దొరగారు, పోయిన కోటు గురించి మరల ఆలోచించకుండా ఇంకొక కోటు కుట్టించుకున్నాడట. ఆకోటుకూడా క్రిందటి రాత్రిలాగే పోయిందట! అలాగ ఏభై కోట్లవరకు పోయినవట!

అప్పుడు దొరగారు "నేను కుట్టించుకొన్న కోట్లన్నియు పోవుచున్నవి. కారణం తెలియుట లేదు" అని కొంచెం ఆలోచించి ఇంట్లో పనిచేసే వాళ్లను, భార్యను, పిల్లలను అడిగినాడట. వారు మాకేమీ తెలియదు అని

చెప్పినారట. అప్పుడు దొరగారు పోలీసు స్టేషన్ వద్దకువెళ్లి ప్రతిరోజూ నాకోటును ఎవడో దొంగ దొంగలించు చున్నాడు. దొంగ మాత్రము దొరుకుట లేదు. అని ఫిర్యాదు చేసేడట. అప్పుడు పోలీసు సబ్ ఇనస్పెక్టరు నేను ఈ దొంగను పట్టుకొనెద నని ఆరోజురాత్రి దొరగారింట్లో పరుండెనట.



దొరగారు మామ్మోలుగా కోటును ధరించి ఒక గదిలో పరుండెనట. ఆ రాత్రి, 11, 12, గంటలు అయ్యేటప్పటికి, దొరగారు గది తలుపులను తెరిచి తిన్నగా తనయింటికి 4 పర్లాంగులలో నుండెడి ఒక పార్కు దగ్గర ఒక పెద్ద గొయ్యితీసి ఆ గోతిలో తనకోటును కప్పెట్టి మరలవచ్చి పరున్నాడట. ఇది అంతయూ, ఇన్స్పెక్టరు మెలకువతో చూచెనట. ఆ మరునాడు ఉదయముననే, ఇన్స్పెక్టరు, అందరినీ తీసుకువెళ్లి, రాత్రి దొరగారు త్రవ్విన గోయిని త్రవ్వి చూడగా అందులో ఇదివరకు పోయిన ఏభై కోట్లు ఉన్నాయట! అప్పుడు కొంతమంది డాక్టర్లు ఇది అంతయు నిద్దట్లో తెలియకుండగనే చేసినపని. ఇటువంటి జబ్బు ఉండటంవల్ల చాల ప్రమాదమని ఆ దొరగారికి చికిత్స చేసినారట.

చూశారా! బాలలూ. ఆ జబ్బు ఉండటంవల్ల ఎంత ప్రమాదం జరిగిందో? మీలో ఎవరికైనా రాత్రుళ్లు నిద్రలో లేచిపోవటం ఉన్నట్లయితే వెంటనే డాక్టరు యొద్దకుపోయి చికిత్స చేయించుకోండేం! లేకపోతే చాల ప్రమాదం.




# జవహర్ యింటి ముఖం పట్టాడు

**అనువాదం : నూరిశెట్టి సాంబశివరావ్ బాబ్జీ**

అది పందొమ్మిది వందల పన్నెండో సంవత్సరం వసంత కాలం. అప్పుడే జవహర్ యిరవైమూడేళ్ల యీడు కలిగిన పెద్దవాడై మన దేశానికి తిరిగొచ్చాడు. అతని కుటుంబంలో వాళ్లంతా అతణ్ని యెన్నాళ్లకో చూసి యెంతో ముచ్చటపడ్డారు. వాళ్లమ్మ మంచి మంచి వంటకాలవీచేసి అతనికి భలేగా స్వాగతమిచ్చింది. అప్పుడు నెహ్రూ కుటుంబం ముస్సోరీ అనేపట్నంలో వుంటూండేది. జవహర్ తిన్నగా అక్కడికే వెళ్లి కొన్నాళ్లపాటు వున్నాడు. అక్కడే మొట్టమొదటి సారిగా తన బుచ్చి చెల్లాయి క్రిష్ణని కలుసుకున్నాడు. కృష్ణ అప్పటికి అయిదేళ్ల చిన్నారి బాల. తనకిదివర కెప్పుడూ తెలీని విడ్డూరమైన అందాల అన్నయ్యని చూడగానే ప్రతి వాళ్లూ క్రిష్ణని వేళాకోళా లాడటం మొదలు పెట్టారు.

కాంగ్రెసంటే యేమిటో తెలుసుగదూ, కుంకుం ?– అది ఒక సంఘం. మన జవహర్ పుట్టేందుకి ముందు నాలుగేళ్ల క్రిందట ఇద్దరు తెల్లదొరలా సంఘాన్ని స్థాపించారు. అప్పుడు మన దేశాన్ని పరిపాలిస్తుండే తెల్లదొరలు తమ దేశాల్లో వుండే నాగరికతకి అలవాటు

పడిపోయిన భారతీయుల్ని తరుచు కలుసుకుందుకి ఉపయోగపడే ఓరకం క్లబ్బుకి మల్లే వుంటూండేది. ఇలాంటి చిన్నక్లబ్బు (కాంగ్రెసు) రాను రాను గొప్ప బలంగలిగిన మహా జాతీయ సంస్థయి దేశంలోవుండే లక్షోపలక్షుల ప్రజలందర్నీ తన వేపుకు యిట్టే ఆకర్షించుకుందంటే యెంత విడ్డూరమో చూశావా కుంకుం! - ఎందుకంటే మెల్లి మెల్లిగా ఆ కాంగ్రెసు సంఘంలో వుండే సభ్యులు మన భారతదేశం తాలూకు అధ్వాన్న పరిస్థితిని బాగా తెలుసుకోగలిగారు. అంచేత పందొమ్మిదివందల యేడో సంవత్సరంలో బెంగాలు రాష్ట్రం విడదీసేసరికి వాళ్లంతా అలావీల్లేదంటూ, ఆయాలోచన మానవలసిందంటూ ఒకే కంఠంతో ప్రభుత్వాని కెలుగెత్తి చాటారు.

శకుంతలా మసాని
కుంకుకి చెప్పినకథకి
అనుసరణ—

కాని కాంగ్రెస్‌లో మెల్లి మెల్లిగా మార్పులు వాటంతటవే రావాలనే పెద్దవాళ్లకి అప్పట్లో బలం ఎక్కువగా ఉండటం మూలాన ప్రభుత్వం హామీ యిచ్చిన మార్పులుగూడ కాకుండ ఆశ నిరాశ చేశారు.

దేశభక్తి పాఠాలు పూర్తిగా నేర్చుకుని జీర్ణం చేసుకొచ్చిన జవహార్‌ని ఎప్పటి కప్పుడే సంతృప్తి పడిపోయే భారతదేశం యేమాత్రమూ సంతోషపెట్టలేక పోయింది. వాళ్ల నాన్నగారిలా అతనుగూడ కాంగ్రెసు సభ్యుడయాడన్న మాటేకాని వాళ్ల నాన్నగారి భావాలకి, తన వుద్దేశాలకి యెప్పుడూ వ్యతిరేకమే.

అతను ఇంగ్లాండులో వుంటూండగా ఓనాడు పత్రికల్లో వాళ్ల నాన్నగారు బెంగాలు యువకుల దౌర్జన్యచర్యల్ని విమర్శిస్తూ రాసిన వ్యాసం చదివాడు. ఆ వెంటనే జవహార్ వాళ్ల నాన్నగారికి ఆవ్యాసానికి తన నిరసన తెలుపుతూ దానికి తను వ్యతిరేకమని రాశేశాడు. అతను తన వుత్తరంలో, 'నాన్నగారూ! మీరు రాసిన అభిప్రాయాలు గవర్నమెంటుకి చాలా సహాయం చేస్తాయనుకుంటాను. నిజమే' అనికూడా రాశాడు. తనకొడుకు రాసిన యీ పెంకితనం వుత్తరం



చూసి మోతీలాల్ కెక్కడాలేని కోపంవొచ్చి జవహార్‌పై కోపంతో ఆఖరికి వెంటనే ఇంటికి తిరిగి వొచ్చేయమని రాసెయ్యాలన్నంత ఉక్రోషం పడ్డారు.

ఈ మోస్తరుగా గడియ గడియకీ నిరుత్సాహంపొంది కొసకి జవహార్ తన సొంతపట్నం అలహాబాదులో వాళ్ల నాన్నగారి చేరికక్రింద ప్లీడరుగా ప్రాక్టీసు మొదలు పెట్టాడు. ఎందుకంటే మోతీలాల్ చాలాచాలా తెలివైన ప్లీడరని నీకిదివరకే తెలుసుగా, కుంకుం! మొదట్నుంచీ ఆయనే పట్నంలో పేరుపొందిన ప్లీడరు. జవహార్‌కి వాళ్లనాన్నగారిదగ్గర కొద్దిగా బెదురున్నా తను అంటేమాత్రం ఎంతో ప్రేమ, అభిమానం, మర్యాద! మన దేశంలో మోతీలాల్ సప్రూని గౌరవించని వారొక్కరూ వుండరని నేననుకుంటాను. ఆయన ఓగొప్ప ప్లీడరే కాదు,- అన్ని విద్యల్లోనూ నేర్పుగలిగిన గొప్ప నాగరికులు. ఆయన పార్సీ భాషలోనూ, అరబ్బీ భాషలోనూ పండితుడు మాత్రమేకాదు, పడమటి దేశాల నాగరికతనీ, వర్తక వ్యాపారాన్నీ బాగా తెలుసుకున్న అనుభవశాలి. మన సమస్యలన్నిట్నీ పరిష్కరించుకుందుకి పడమటి దేశాలే మనకి దారి చూపిస్తాయనే నమ్మకం ఆయనకి బాగా వుండేది. అంతే కాకుండా ఆదేశాల్నుంచి మన దేశం నేర్చుకోవాల్సిన సంగతు లెన్నెన్నో వున్నాయని ఆయన అనుకునేవాడు. చాలా కాలం

యెన్నెన్నో కష్టాలుపడి బ్రిటిషు దొరల పరిపాలన నెదిరించి పోరాడినప్పటికీ తెల్లదొరల్ని పొగడటం తప్పించి యింకో సాయం చెయ్యలేక పోయాడు.

మన దేశంకూడా యిరోపా ఖండంలో వుండే దేశాల్లాగ ఉండాలని ఆయనకోరిక. మనం యెంతకాలం మనపాత చింతకాయపచ్చడి ఆచారాలకి, మూఢ నమ్మకాలకి లొంగి పోయి వుంటామో, అంతకాలం మనం స్వరాజ్యం పొందటానికే అర్హులంకామని ఆయన అభిప్రాయం. అంచేత యీ పాత రివాజులన్నిట్నీ మోతీలాల్ ధైర్యంగా యెవరెన్ని అన్నా ఛిన్నాభిన్నంచేసి రూపు మాపేందుకి బయల్దేరాడు. ఆయన స్వయంగా పడమటి దేశాల తరహాలోనే బ్రతికాడు. అంతేగాకుండా నీకూ్కాడా తెలుసుగమా కుంకం, మతాచారాల ప్రకారం నడుచుకోకుండా, వాటిని లక్ష్యపెట్టకుండా ఆయన ప్రపంచమంతా తిరిగాడు. మళ్లీ యింటికి తిరిగొచ్చేప్పుడుకూడా పరిశుభ్రమయేందుకి చెయ్యాల్సిన విధుల్ని పాటించలేదు. అది ముఖ్యంగా మన పండితులకి, వెనుకబడిపోయిన ప్రజలకి ఆయనపైని ఓవిధమైన అసహ్యాన్ని కలిగించింది. అయినా అది మోతీలాల్ని యేమాత్రమూ కలతపెట్టలేక పోయింది.

ఇంగ్లీషు వాళ్లని పొగడటంలో వాళ్ల నాన్నగారితో తను కూడా ఓవంతు పంచుకున్నాడు జవహార్ ! అంతేకాదు, వాళ్లతో కలిసి మెలిసి తిరగవలసిన అవసరం యింకా చాలా వుందనుకున్నాడు. ఎందుకో తెలుసా కుంకం ! నెహూ్రు కుటుంబమంతా చక్కని విదేశీబాణీలోనే నడుస్తూ వచ్చింది. జవహార్ చిన్నబ్బాయిగా వున్నంతకాలం దాదీ, ప్రయివేటు మేష్టారూ, యిద్దరూ తెల్లదొరసానులే.

ఇలా నెలలు గడిచి పోయిన కొద్దీ జవహార్ తన జీవితంలో అలసి పోయాడు. అయినా మన స్వరాజ్యయుద్ధంలో తగిన పాత్ర తీసుకోవటానికతనికి సమయం యింకా రాలేదు. అందుచేతనే జవహార్ కోర్టుల్లోనే పనిచేసి



కొంత కాలందా
కా చూశాడు.

తనకి పనిలే
నప్పుడుజవహార్
అప్పుడప్పుడు వే
టకికూడా వె
ళ్తూండటం అల
వాటు. అంటే
అతనికి జంతువుల్ని చంపుదా
మనే వుద్దేశంలేదు. కాని పచ్చని
మన దేశం, దట్టమైన అడవులూ
అంటే అతనికెంతో సరదా.
ఎప్పుడేనా బుద్ధిపుడితే యేదో
సరదాకని అతను తుపాకి కాలు
స్తూండేవాడు. కాని ఒకనాడు
అలా కాల్చటంతో తిన్నగా
ఆదెబ్బ ఓలేడిపిల్లకి తగిలింది.
పాపం దెబ్బతిన్న ఆలేత లేడిపిల్ల
యెక్కడున్నది అక్కడే పడి
పోయి తనపెద్ద కళ్లంట పొంగు
కొస్తున్న నీటితో అతని వేపు
దీనంగా చూసింది.

కుంకుం! నీకు చాలా జాలి
కలుగుతుంది కదూ? మననాయ
కుడు పాపం ఆ సాధు జంతువుకి,
ఆ పిరికి లేడిపిల్లకి యెంతో బాధ
కలిగించినందుకు నీకు చాలా
విచారం కలుగుతుందికదూ!–

జవహార్ దికూడా నీలాంటి
మెత్తని మనస్సే, కుంకుం! పాపం
ఆలేడిపిల్ల యేదారీలేక యేడుస్తూ
అతని వేపు బేలగా చూస్తూంటే
దాని కన్నీళ్లు జవహార్ కంట్లోకి
కూడా ప్రయాణం చేశాయి;
దాంతో జవహార్ బుద్ధి తెచ్చుకుని
యిటుపైని యెన్నడూ తుపాకి
కాల్చగూడదని చెంపలు వాయిం
చుకున్నాడు.

(ఇంకావుంది)

# ఆవుని చంపిన పాపం కథ

రచన: కలవకొలను కృష్ణమూర్తి (హైదరాబాదు)

అనగా అనగా ఒకవూళ్లో ఒక అత్తా, కోడలూ వున్నారు. అత్తది అంతా చేదస్తం. కోడలు నాజూకు మనిషి. పెరట్లో అత్తగారు తులసిమొక్క వేసి పూజిస్తుంది. కోడలు రోజా మొక్కలు, మల్లెమొక్కలు వేసి, పువ్వులుకోసి తలలో సింగారించుకుంటుంది.

వీళ్ల ఇంటిపక్క ఇంటిలో ఒక బ్రాహ్మడు నల్ల ఆవుని పెంచుతున్నాడు. ఆ ఆవు ప్రతి రోజూ వీళ్లింటిలోకి వచ్చి ఆ తులసిమొక్కను, రోజా మొక్కల్ని కాలితో కుమ్మి పారిపోతుండేది.

అత్తగారు రోజూ ఆ కోడల్ని తిడ్తూవుండేది. ఏమనీ? ఆ పూల మొక్కలు వేయబట్టే ఆ ఆవు వచ్చి మట్టేస్తున్నాదని.

"ఈసారి ఆ ఆవు తిరిగివస్తే నీవీపు బద్దల కొడతానుండు!" అని బెదరించింది.

ఆ మర్నాడు ఆ కోడలు దొడ్డి ల గుమ్మావ కూచుంది. నల్లావు వచ్చింది. కోడలు ఒక రుబ్బురోలుతీసి ఆ ఆవుమీదికి విసిరింది! ఇంకేముందీ! ఆవు క్రిందపడిపోయి, కళ్లు తేలవేసింది!

"అత్తా! అత్తా! ఆవుచచ్చిపోయింది!" అని కేకలు వేసింది కోడలు.

"అయ్యో! గోహత్య చేసేవే పాడుదానా! ఇప్పుడెలాగ! ఈ పాపానికి ప్రాయశ్చిత్తం కావాలి!" అంటూ వెంటనే ఆ పక్కింటి బ్రాహ్మడ్ని పిలిచింది.

ఆ బ్రాహ్మడు వూరుకుంటాడా!

"ఈ పాపం పోవడానికి ఒకటే మార్గం వుంది. సువర్ణ దానంచేయాలి. నాలాంటి బ్రాహ్మడికి బంగారపు ఆవుని తయారుచేసి ఇయ్యాలి" అన్నాడు ఆ బ్రాహ్మడు.

అత్త:-బంగారం ఆవే! అమ్మయ్యో! నేనెక్కడినుంచి తేను!

బ్రాహ్మ :-అబ్బే! ఓ పదితులాల బంగారం చాలులెండి.

అత్త :-(గుండె బాదుకుంటూ) పదితులాలే!

బ్రాహ్మ :-పోనీ 5 తులాలు చేసుకోండి. అంతకి తగ్గదు.

అత్త :-ఊఁ...ఇంకా?

బ్రాహ్మ :- ఇదుగో ఈ జాబితా ప్రకారం వస్తువులు తెప్పించండి. 1 బస్తా కందిపప్పు; ½ బస్తా పెసరపప్పు; 1 డబ్బా నెయ్యి; 1 డబ్బా నూనె; 1 మణుగు పంచదార.

అత్త :-ఇవన్నీ ఎందుకండీ-

బ్రాహ్మ :-బాహ్మణ సంతర్పణకు. వెంటనే డబ్బిప్పిస్తే అవన్నీ కొని శాంతిపూజ మా ఇంట్లోనే చేయిస్తాను.

అత్త :-ఏమీ! మీ ఇంట్లోనా! మా ఇంట్లోనా!

బాహ్మ :-మీది గోహత్య చేసిన మైల ఇల్లు. ఇయ్యండి డబ్బు.

అత్త :-అయితే ఇదుగో ఈ అయిదువందలూ తీసికెళ్లండి. గ్రహశాంతిచేసి, గోహత్యా పాపం లేకుండా చేయండి.

బ్రాహ్మ :-చిత్తం, సెలవు.



అత్తగారు తనచేతిది 500
ాపాయలు వదిలి పోయాయని
ంమ ధుమ లాడుతోంది.

కోడలు, పెరట్లో పడివున్న
వుని చూద్దాం అని వెళ్లింది.

ఆవు అక్కడ లేదు!


"అయ్యో! నల్లావు ఏదీ?
లా మాయమయి పోయింది!"
ంటూ కోడలు గోలపెట్టింది.

అసలు గమ్మత్తేమిటంటే ఆ
వు నిజంగా చనిపోలేదు. చని
యినట్టు నటించింది. ఆ
ాహ్మడు ఆ నల్లావుని అలాగ
రిఫీజా చేయించాడు.

అత్తగారు గబగబా బ్రాహ్మ
డింటికి వెళ్లింది. "ఏవండోయ్!
మీఆవు చనిపోలేదు. మారూపా
యిలు మాకివ్వండి" అని
అడిగింది.

"దానంచేసిన సొమ్ము తిరిగి
ఇస్తే మీకు రెండింతల పాపం
చుట్టుకుంటుంది జాగ్రత!" అని
బ్రాహ్మడు జవాబిచ్చాడు.

నా మూఢనమ్మకాలకి తగిన
ప్రాయశ్చిత్తం అయింది అంటూ
అత్తగారు లెంపలు వాయించు
కుంది.




బాలా! ఈపైనవున్న సైనుబోర్డు చూశావా? రామారావు
నుబోర్డులు రాసేకంపెనీ పెట్టాడు. కాని, ఎన్నిరోజులు, ఎన్ని
రాలు తన దుకాణంలో కూర్చున్నా ఒక్కరేనా ఆతనికి పని
య్యలేదు. కారణమేమిటో ఊహించగలవా? తెలియకపోతే
ఖరు పేజీలలో చూడు.

—నడకుదుటి వెంకట సత్యనారాయణ (కాకినాడ)



# బాల డైరి

బాల డైరీ రాయడం ఈమధ్య బొత్తిగా మరిచిపోయింది. బాలలు రోజూ తమ అనుభవాలు, పనులు డైరీరూపంలో రాస్తే ఎంతో బాగుంటుంది. మళ్ళీ ప్రారంభిద్దాం—సం॥

## ఏప్రిలు

### 1 శనివారం

కొత్త డైరీ రాయడం మొదలెట్టాను. ఏమిటి రాయడమూ అని ఆలోచించా. నేను చేసిన మంచీ చెడ్డా అన్నీ రాసేయాలనుకున్నా.

### 2 ఆదివారం

పరీక్ష లింకా 13 రోజులున్నాయి. లెక్కలొక్కటే నాకు బెంగ. నాకే అధికారం వుంటేనా—లోకంలోనుంచి లెక్కలూ, జాగ్రఫీ, వ్యాకరణం తీసి పారేద్దును. జాగ్రఫీకి 20 పేజీల నోట్సు రాశాను. "నీ తలకాయ! నోట్సు ఎంతరాస్తే ఏమి లాభం? బుర్రకెక్కాలి" అంటాడు అన్నయ్య. వాడికి మహా గొప్ప, తను పెద్ద క్లాసని. అయినా ఇదీ నిజమే.

### 3 సోమవారం

ఈరోజున తమ్ముడికీ నాకూ పెద్ద దెబ్బలాటయింది. నా ఫిలుముల పెట్టె వాడు లాక్కున్నాడు. నేను కొట్టేను. వాడు ఏడ్చాడు. నాకు జాలివేసింది. మంచిమాటలాడాను. ఫిలుంపెట్టె ఇచ్చేశాడు. తమ్ముడు మంచివాడే!

### 4 మంగళవారం

ఇవాళ గర్ల్‌గైడ్ మీటింగు. నన్ను కూడా మాట్లాడమన్నారు. నాకు సిగ్గేసింది. ఇంటికివచ్చాక,

నా సిగ్గును తలచుకొని సిగ్గుపడి పోయాను.

5 బుధవారం

'తిరుగుబాటు' సినీమాకి వెళ్లాను. ఏమిటో-పాత కథలా గుందని అన్నయ్య అన్నాడు. బి. యన్. ఆర్. కామిక్కు బాగుంద్. అందులో వేసిన పిల్ల బాగుంది. ఎవరో!

6 గురువారం

పరీక్ష చదువు సీరియస్‌గా ప్రారంభించా. పరీక్షలయేవరకూ ఇంకే సినీమాకు వెళ్లను.

7 శుక్రవారం

అన్నయ్య లెక్కలు చెప్తాను రమ్మన్నాడు. నాకు రాని పెద్ద లెక్కలిచ్చి చేయమన్నాడు. చేయలేదు. రెండు మొట్టికాయ లిచ్చి వెళ్లిపోయాడు. మా అన్నయ్యకేగాని బడిలో లెక్కల మేష్టారు పని అయితే వాడిని "మొట్టికాయలమేష్టార"ని వుడికించరూ?

8 శనివారం

'బాల'కి కథ రాద్దామని బుద్ధిపుట్టింది. కాగితం కలం తీశాను. ఇంతలో పరీక్షలు జ్ఞాపకంవచ్చి మానేసాను.

9 ఆదివారం

ఈరోజున నా పుట్టినరోజు. ఇవాళ నేను చదవకపోయినా అమ్మ కొట్టలే. మధ్యాహ్నం ఒంటిగంటకే రేడియో ఎదుట కూర్చున్నా. ప్రోగ్రాంలో నా పేరు చెప్పారు! నాకుకూడా మెడ్రాసు వెళ్లాలని ఎంతో ఇదిగా వుంది.

10 సోమవారము

బడి లేదు. పరీక్ష చదువులకి సెలవులిచ్చారు. అబ్బ! విసుగ్గా వుంది. పరీక్ష లెప్పుడు పోతాయో!

11 మంగళవారం

ఈవ్వూరికి ఎదో కొత్త ఫిలిం వచ్చింది. చాలామంది వెళ్తున్నారు. వెధవది పరీక్షల ముందరే ఈ ఫిలిం రావాలీ!

12 బుధవారం

వంకాయ కారంపెట్టి వండుతానంది అమ్మ. కాదు వేయించమన్నారు నాన్నారు. కారంపెట్టి కూరే వండింది అమ్మ. నాన్నకి కోపంవచ్చింది. భోజనం మానే

శారు. కాని మళ్ళీమధ్యాహ్నం ఫలహారం టయిముకి అమ్మా నాన్నా జట్టుకలిసిపోయారు.

13 గురువారం

ఇవాళో మంచి పనిచేశా. వణుకుతున్న ఒక ముసలి అవ్వ కనిపించింది. రోడ్డు దాటించమంది. జాగ్రత్తగా దాటించా. అరగంటనుంచున్నా ఎవ్వరూ సహాయం చేయలేదట. నేను మంచి పిల్లనని అవ్వ అంది.

14 శుక్రవారం

రేపటినుంచీ పరీక్షలు. లీలా, సర్రూ కలిసి రాత్రి రెండుదాకా టీ త్రాగి చదువుతారట. నాకు ఇటువంటి చదువులు పడవు.

15 శనివారం

తెనుగుబాగా రాశాను. లీలా వాళ్లు దేముడికి మొక్కుకున్నారట కొబ్బరికాయ కొడతామని. ఆ దేనా ప్యాసయితేనే కొడతారట. దేముడికి ఇది లంచమా?

16 ఆదివారం

రేపు లెక్కలు. కొన్ని ప్రశ్నలు తెలిసిపోయాయని రాధ చెప్పింది. అవి తప్పకుండా పడతాయంది. ఈ మాటవిని మా నాన్న అందరికీ చీవాట్లు పెట్టారు.

17 సోమవారం

లెక్కలు బాగానే చేశాను. ప్యాసు మార్కులొస్తాయి. రాధ చెప్పిన ప్రశ్నలు ఒకటీ రాలేదు. పాపం దానిమాటలు నమ్మినవాళ్లందరికీ మున్నాలే!

18 మంగళవారం

ఇంగ్లీషు బాగా రాశాను. 60 మార్కులు రావొచ్చు.

19 బుధవారం

సైన్సు పేపరు యీజీగానే వుంది. ఇంక రేపొక్కరోజు గడిచిపోతే!...

20 గురువారం

జాగ్రఫీ-హిస్టరీ కలిసి ఇవాళ పరీక్ష. మంచి ప్రశ్నలు ఒకటీ పడలేదు.

21 శుక్రవారం

హమ్మయ్య! పరీక్ష లయిపోయాయి. హాయిగా సెలవులు.

22 శనివారం

నాన్న మద్రాసు ప్రయాణం. నన్నుకూడా రమ్మన్నారు. తమ్ముడు ఏడిస్తే, చేతిలో రూపాయి పెట్టారు.

23 ఆదివారం

మెయిలు లేటుగా మద్రాసు చేరింది. సుళ్లూరుపేటదగ్గర పడిపోయిన రైలు ఇంజను, విరిగిపోయిన పెట్టెలు చూచాను. చాలా దుఃఖం వచ్చింది.

గబగబ భోంచేసి రేడియో స్టేషనుకి వెళ్లాను. అక్కడ రేడియో అన్నయ్య, అక్కయ్య "ఓహో ఎప్పుడొచ్చావ్?" అంటూ ఎంతో సరదాగా అడిగారు. ప్రోగ్రాంలో నాచేత ఒక పాట పాడించారు. బలేబాగుంది ప్రోగ్రాం. ప్రోగ్రాం తరువాత టిఫిన్ కూడా బాగుంది.

24 సోమవారం

ఈరోజు మ్యూజియం చూశాము. హైకోర్టుమీద లైట్ హౌస్ కూడా చూశాము.

25 మంగళవారం

మైలాపూరు 'బాల' ఆఫీసుకి వెళ్లాను. మేడమీద చూస్తే రేడియో అన్నయ్య, అక్కయ్య అక్కడ కూర్చొనివున్నారు. బాలన్నయ్య అక్కయ్య ఏరీ అని అడిగాను. మేమే! అన్నారు. ఆశ్చర్యం!

"లలిత"



# ప్రశ్నలూ — జవాబులూ

**ప్రశ్న :-** A. M.; P.M. అంటే ఏమి టన్నయ్యా ?

—దాసు (అనకాపల్లి)

**జ :-** M అంటే మిరిడియన్. మిరిడి యన్ అంటే మట్ట మధ్యాహ్నం 12 గంటలకు అన్నమాట, A అంటే యాంటీ; అంటే "ముందు" అని అర్థం. మధ్యాహ్నం 12 గంటలకు ముందుగా A. M. అంటారు. 12 గంటల తరువాత పోస్టు మిరిడియన్ అంటారు.

**ప్రశ్న :-** అన్నయ్యా ! నీముఖ్యో శయం ఏమిటి ?

—పిరాట్ల అచ్యుత రాధాకృష్ణ (కాకినాడ)

**జ :-** నా ముఖ్యోశయం మీబాగే. పిల్లలు ఎన్నెన్ని విధాల బాగుపడతారో అన్నన్ని విధాల సాధ్యమైనంత వరకు తోడ్పడాలనీ.

**ప్రశ్న :-** నేను ఒక బాలుర పత్రిక పెట్టాలనుకుంటున్నాను. ఏం చెయ్యాలి.

—వడ్డెంపూడి హనుమంతరావు (గణపవరం)

**జ :-** ఆ ప్రయత్నం ఇప్పట్లో మానుకో.

**ప్రశ్న :-** కొబ్బరి కాయలోనికి నీళ్లు ఎలా వెళ్లినాయ్ !

—పి. వి. రత్నం. (విజయనగరం)

**జ :-** అలా వేళ్లలోంచి, కాండము లోంచి కాయలోనికి వెళ్లివుం టాయి-లేదా ఇదంతా ఆ భగవం తుడి మాయవలన జరిగి వుంటుంది.

**ప్ర :-** "లక్ష్మమ్మ" లో బాగా ఏడ్చారా, "శ్రీ లక్ష్మమ్మ కథ" లో బాగా ఏడ్చారా ?

—బండ రాముడు (కాకినాడ)

**జ :-** వాళ్లు ఏలా ఏడిస్తే మనకేం అంటా ! సరేగాని బండరాముడూ ! నీ పరీక్ష నువ్వు బాగానే ఏడ్చావా ?

**ప్రశ్న :-** ఏడు ఎనిమిది నెలల పాప లకు, కొందరికి తలవెంట్రుకలు, చిన్న చింతకాయల్లాగ గంట్లు (జడలు) కడతాయి. కారణం ?

—డి. లక్ష్మీకాంతరావు (అనంతపురం)

**జ :-** తల్లులు సరిగా తలదువ్వక అశ్రద్ధ చేస్తే చెమట, మురికి, ధూళిపడి అలాగ గంట్లు కడతాయి. అలేక తలవెంట్రుకలు వేగం చిక్కుపడి పోతాయి !

ప్రశ్న :-మీరు ఏప్రిల్ బాలలో 'టెంకాయ' 'వంకాయ' అను మాటలకు సరియైన మాట ఒక చెల్లాయి అడుగుతే మీరు 'చెంపకాయ' 'లెంపకాయ' అని జవాబు ఇచ్చారు. నేను అది తప్పు అంటాను' దాని సరియైన జవాబు "లింకాయ." ఏం? నిజమేనా !

—మణికొండ రమణమ్మ. (ఇచ్ఛాపురం)

జ :-నిజమే: కాని "లింకాయ" కూడా నాలుగక్షరాల మాటే! అది "లింగకాయ" కాని లింకాయ కాదు. చెంప్కాయ, లెంప్కాయకూడా మూడక్షరాల మాటలే అయితే!

ప్రశ్న :-'గుణసుందరి' కథలో కమల పుష్పము ఒక సరోవరములో వుండాలి కాని, వట్టి గడ్డిప్రదేశములో ఎలాగున పుట్టిందండీ?

—యాట్ల అప్పలరాజు (విజయనగరం)

జ :-అది గడ్డిలోనూ పుట్టలేదు. వాహినీ వారి స్టూడియోలో పుట్టింది!

ప్రశ్న :-నాకు ఉంగరాల జుట్టు వుంది. కొందరికి లేదు—ఎందుచేత?

—టి. కె. శేషాచలం (కడప)

జ :-అది నీ అదృష్టం. బహుశా: పూర్వజన్మలో నువ్వు నాలాంటివాడికి ఉంగరాలు దానంచేసి వుంటావు.

ప్రశ్న :-మనము భోజనము చేసిన తరువాత ఎంతసేపటిలో అది జీర్ణమవుతుంది?

—మా. వీరభద్రరావు (పెద్దబ్రహ్మదేవం)

జ :-సుమారు నాలుగు గంటలలో.

ప్రశ్న :-అరసున్నా ఇలాగ ( పెడతారుగాని ఇలాగ ) ఎందుకు పెట్టరూ?

—ఎస్. మీరాసాహెబ్ (నూజివీడు)

జ :-అంతా అలవాటు భాయీ! అలవాటు! నువ్వు ఉర్దూ అక్షరాలు అటునుంచి ఇటురాస్తావు గనుక ఈ వ్యల్లా సీదా ప్రశ్న వేశావు.



## షాహుకారు

విజయా ప్రొడక్షన్సువారు తీసిన మొదటి చిత్రం షాహుకారు. నీటుగా చక్కగా తీశారు. ఇందులోని యాక్టర్లందరూ బాగా చేశారు. కథకూడా బాగుంది. సంభాషణలు చాలా రక్తిగా వున్నాయి. ఒక్కచోటమాత్రం చాలా అసహ్యంగా వుంది. హోటలులో వేశ్యను తెచ్చి నాట్యం ఆడించడం బాగులేదు. ఆసీను నవ్వుపుట్టిస్తుంది కాని కోపం కూడా తెప్పిస్తుంది. అందరికంటే చాకలివేషం వేసిన కనకం చాలాబాగుంది. మొదటిసారి అయినా జానకి బాగానే చేసింది.

విజయావారి చిత్రాలు ఇంకాఇంకా బాగావస్తాయని తెలుస్తోంది. సంతోషం.

---

## పల్లెటూరి పిల్ల

బి. ఎ. సుబ్బారావుగారు ఎంతో ప్రయాసపడి, శోభనాచలవారి సహాయంతోనూ, ఇతర స్నేహితుల సహాయంతోనూ ఈ ఫిలిం తీశారు. ఒక దుష్టుడైన కొండదొర పల్లెటూరివారిని ఎటువంటి హింసలు పెడతాడో, అఖరికి వానికి ఎటువంటి గతి పట్టుతుందో ఈ కథలో తెలుస్తుంది.

ఈ ఫిలుంలో చిరంజీవి మల్లిక పల్లెటూరి పిల్లలలో ఒక చిన్నారి పిల్లగా చాలా బాగానటించింది. పెద్ద యాక్టర్లందరూ పేరుబడ్డవారే. మోటుహాస్యం లేకుండా కథ ఎంతో బాగుంది.

## విశాలాంధ్ర వాచకములు

కడపలో సుప్రశిద్ధ బుక్ పబ్లిషర్సగు రాయలు అండ్ కో వారు ప్రచురించిన విశాలాంధ్ర వాచకములు (1, 2, 3, 4, 5 తరగతులు) మా ఆఫీసు చేరినవి.

దళసరి అట్ట, తెల్లని గ్లేజు కాగితాల మీద చక్కని అచ్చుతో ఆయా తరగతులకు ఉపయోగపడునట్లు ప్రచురించారు. గ్రంథకర్తలగు డా॥ గిడుగు వెంకట సీతాపతి, శ్రీ జె. చెన్నారెడ్డి: శ్రీ అనుముల వెంకటశేషకవులు మిక్కిలి శ్రమతీసుకొని పాఠ్యవిషయములు సమకూర్చారు. వెల 4 అణాలు మొదలు 8 అణాలవరకు గలదు.

---

## స్వతంత్రభారత చరిత్ర

రాయలు అండ్ కో (కడప) వారే ఈ పుస్తకములు 3, 4, 5 తరగతి విద్యార్థులకొరకు ప్రచురించారు. గ్రంథకర్త శ్రీ ఎస్. ఉదయలింగరావుగారు చిన్న చిన్న వాక్యములతో మన దేశ చరిత్ర చక్కగా వ్రాశారు. గ్లేజు కాగితం. చక్కని అచ్చు. వెల 4, 6, 8 అణాలు.

---

## వీరకంకణము

ఇది శ్రీ దండిపల్లి వేంకటసుబ్బశాస్త్రిగారిచే రచించబడిన చరిత్రాత్మకమైన నవల. ఇందు కవి, బండితుడు, వీరుడు అగు జగన్నాథుని చరిత్ర కథారూపమున వ్రాయబడింది. 116 పేజీలు. చక్కని అచ్చుతో త్రివర్ణ ముఖచిత్రముతో 1 రూపాయి వెలకు శ్రీ బాల సరస్వతీ బుక్ డిపో (కర్నూలు) వారు ప్రచురించారు.




## తెనాలి బాలవిజ్ఞాన సమితి :

1948 సం॥ స్థాపితమయిన ఈ సమితి వార్షికోత్సవం మార్చి 21 తేదీని జరిగింది. బీదలకు సహాయముచేయుటే ఈసమితి ముఖ్యోద్దేశమని శ్రీ వి. బి. చౌదరీ వ్రాయుచున్నారు.

## భీమవరం శారదా బాలసంఘం :

ఫిబ్రవరి నెలలో పెట్టబడిన ఈ సంఘం 'సరస్వతి' అనే వ్రాతపత్రికను నడుపుచున్నారు. ఎడిటర్ శ్రీ డి. వి. సుబ్బారావు.

## అనకాపల్లి జైభారతి సంఘము :

ఈ సంఘములో 40 మంది సభ్యులున్నారు. ప్రెసిడెంటు శ్రీ మద్దాల అచ్చయ్య నాయుడు. కార్యదర్శి శ్రీ అప్పారావు. ఈ సంఘసభ్యులు యీ వేసవి సెలవుల్లో నిజమైన సేవ ఏమిటి చేస్తారో చూడవలసి వుంది.

## లేపాక్షి బోర్డు ఎలిమెంటరి పాఠశాల సారస్వత సంఘము :

ఏప్రిల్ 12 తేదీని ఈ సంఘము సమావేశమైనది. శ్రీ రాజన్నగారు లీడరు, శ్రీ అజీజు సాహెబ్ గారు కార్యదర్శి : శ్రీ L. సుందరరావుగారు అధ్యక్షులుగా పనిచేయు చున్నారు.

## భీమవరం శ్రీ శివాజీ బాల సంఘం :

బాలలకు పోటీలు పెట్టి, ఏప్రిల్ 15 తేదీని బహుమతులు ఇవ్వడమైనది. బహుమతులు పొందినవారిలో శ్రీ బి. ఈ. విద్యాసాగర్, సి. హెచ్. సూర్యనారాయణమూర్తి, బి. యల్. నరసింహరావు, వ. రామగోపాలం గార్లున్నారు. క్రికెటుకీ. శ్రీ క. సత్యనారాయణరాజు.

తిరుపతిలో మే నెల 2-వ తేదీనుండి విద్యార్థుల శ్రీ త్యాగరాజస్వామి 4-వ వార్షిక మహోత్సవం జరుగుతుందని తెలియుచున్నది.


# ఆంధ్రమహిళ

6 వ జన్మదిన సంచిక


**ద్వివర్ణ ముఖచిత్రం - 120 పేజీలు**

రాజకీయాలు, సంఘ వృత్తాంతాలు, స్త్రీసమస్యలు, లలితకళలు, నాటికలు, చిన్న కథలు, పెద్ద కథలతో సర్వాంగ సుందరంగా తయారవుతోంది.

వెల 1 రూపాయి

మే నెల 5 తేదీని వెలువడును

సంపాదక వర్గం :
శ్రీమతి దుర్గాబాయి, M.A., B.L.,
శ్రీమతి చన్నఘంటమ్మ, M.A., L.T.,
ప్రతులు వలయువారు :
**మేనేజరు 'ఆంధ్రమహిళ'**
మద్రాసు 4.


Buchi Press
COMMISSION
COLLEGE

# బొమ్మల మాటలు

"క"— బాలా! ఈ పక్క పేజీలో ఎన్నో బొమ్మలున్నాయి. బాగాచూడు. అందులో "క" అనే అక్షరంతో ప్రారంభమయిన వస్తువులు ఎన్నివున్నాయో తెలుసుకో. ఉదహారణ: కలము. మాదగ్గర ఆమాటల జాబితా నకలువుంది. ఎవరైతే మాజాబితాలో వున్న మాటలన్నీ పంపుతారో వాళ్ల పేర్లు ఒచ్చేనెల 'బాల' లో వేస్తాం.

జవాబులు కార్డుమీదరాసి పంపవచ్చును. మీపేరు, అడ్రసు కుదురుగా రాయండి.

"బాల" ఆఫీసు, రాయపేట, మద్రాసు-14

---


# కర్పూరపు ఉపయోగం

చీమలు ఎక్కువగావున్న ఇంట్లో హారతి కర్పూరపుపొడిని చల్లితే చీమలు రావు. పడిశముపట్టినప్పుడు, కొంచెం కర్పూరం కాసినిబియ్యంలో కలిపి జేబురుమాల్లో మూటకట్టి, అప్పుడప్పుడు వాసన చూస్తూ వుంటే పడిశం పోతుంది. ఇవి, కర్పూరపు ఉపయోగాలలోకొన్ని. ఇలాంటిరోగాలకు, మంచికర్పూరాన్నే వాడాలి. మంచికర్పూరంకావాలంటే

'గడియారంమార్కు కర్పూరం.' కొనాలి

గడియారం మార్కు కర్పూరం అన్నిషాపులలోను దొరుకుతుంది. లేదా, యీ క్రింది అడ్రసుకు వ్రాయండి.

గోపాల్‌జీ చాంప్‌షీ అండ్ కో.,

30. గోవిందప్పనాయక్ వీధి, • • జి. టి. మదరాసు.

# తెనుగు పిల్లల రేడియో ప్రోగ్రాములు

## బాలానందం

### మే 1950

**6-వ తేదీ శనివారం**

రారండోయ్; అక్కయ్యకబుర్లు; అవ్వా-తాత- నాటిక; మల్లెపువ్వు-పాట; అనగా అనగా కథ; మీ పాటలూ, కథలు; చాలునింక.

**13-వ తేదీ శనివారం**

రారండోయ్; అక్కయ్యకబుర్లు; దొంగ పక్షి-నాటిక; ఏదీ చెప్పుకో చూద్దాం?-ప్రశ్న; అనగా అనగా కథ; మీకథలు. పాటలు; చాలునింక.

**20-వ తేదీ శనివారం**

రారండోయ్; అక్కయ్యకబుర్లు; కలనిజము-నాటిక; కొత్తఆటలు; అనగా అనగా కథ; మీపాటలు, పద్యాలు; చాలునింక.

**27-వ తేదీ శనివారం**

రారండోయ్; అక్కయ్యకబుర్లు; గుజ్జనగుళ్లు - నాటిక; బావపాటలు; మొట్టికాయ- పాట; మీకథలు, పద్యాలు; చాలునింక.

## ఆటవిడుపు

### మే 1950

**7-వ తేదీ ఆదివారం**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాలు; తాతయ్య చలివేంద్రం; పరధ్యాహ్నం కథలు; చిక్కుప్రశ్న; పోదామా.

**14-వ తేదీ ఆదివారం**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాలు; పొట్టిబావతో బీచి షికారు-రూపకం; సెలవుల్లో సరదాలు; పోదామా.

**21-వ తేదీ ఆదివారం**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాలు; "బాలడిటెక్టివ్" - నాటిక కుందూగాడి విందు; మీ పాటలూ అవీ; పోదామా.

**28-వ తేదీ ఆదివారం**

రారె చిన్నిపిల్లలార; ఉత్తరాలు; "శరగోపయ్య"-నాటిక; "పుత్తడిబొమ్మ పూర్ణమ్మ"-పాటకథ; చిక్కుప్రశ్న; పోదామా.



♦ పుట్టింరోజులు ♦

మీ పుట్టింరోజు పండుగకిగాని, మీ ఇంట్లో పెళ్లి పిలుపులకుగాని శుభలేఖలు మొదలగునవి, బాలా ప్రెస్సులో చక్కగా అచ్చువేసి యీయబడును. కొత్త టైపులు-అందమైన అచ్చు.

ఆఫీసు: 170, రాయపేట హైరోడ్డు మదరాసు-14.

# మాటలతో ఆటలు—నెం 7

బాలా! ఈదిగువ చదరంలోని అక్షరాలు నింపి, మాటలు పూర్తిచేసి ఉంచుకో! వచ్చేనెల 'బాల' లో సరియైన సమాధానం చూడు.



## ఆధారాలు

### అడ్డము

1. శరీరములో ఒకభాగము.
4. స్త్రీ
6. సమయము
7. వాటి (అవే)
8. శత్రువు
10. ... వలన పనులు సాధించవచ్చును.
11. వ్రతము
13. పచ్చడిబద్దలు బలేఇది
16. మోక్షము
17. ఈ కొండమీద కోతులు మెండు!

### నిలువు

1. దీనిని నమ్మలేము.
2. తీగ
3. ఈ కాలువలోని నీరుతీయకు!
5. పౌరుషము.
7. సుగ్రీవుని అన్న
8. సరదా
9. ఇటలీ ముఖ్యపట్టణము
12. ఆంజనేయుడు
14. చిన్న
15. ఇదికూడా పన్నెండే.

## మాటలతో ఆటలు - 6
### (జవాబు)

అడ్డము: 1. కల, 3. బాలకుడు, 6. శక్క, 7. డినా, 8. ముదము, 9. అడవి, అటవి, 12. రామ, 14. సీల, 15. కరములు, 16 సాము.

నిలువు: 1. కవనము, 2. లక్క, 3. బాకాలు, బాజాలు, 4. కుడి, 5. దునా, 10. విమలము, 11. రెక్కలు, చుక్కలు, 12 రాక, 13 మర, 14. సీసా.

### సైనుబోర్డు కంపెనీ (జవాబు)

రామారావే నిజమైన మంచి పెయింటరయితే, ఆబోర్డు "ముత్యం" గారి చేత వ్రాయించేదెందుకు? రామారావుకి పెయింటు చేయడం రాదన్నమాట. అంచేత ఎవ్వరూ ఆతనికి పనిఇయ్యలేదు.

### సెలవుల్లో సరదాలు (జవాబు)

జతలు: చింతపిక్కలు 1, 4, 5, 10, 14, 15, 19, 26. 27, 34, 38, 39, 43, 48, 49, 52 గళ్లలో పెడితే సరి.

ప్రశ్నల వర్షం: 1. అన్ని నెలలలో 2. బొగ్గు; 3. అగ్గిపుల్ల; 4. డిక్షనరీలో; 5. సలహా: 6. ఆడదోమలు; 7. రెక్కల శబ్దం; 8. ఊపిరి; 9. రెండూ కాదు; న్యూసుతో కలుపుతాను.

### చెవులపిల్లులు ఆరు (జవాబు)

5 దో పిల్లి, 6 వ పిల్లి కవలలు

### పొడుపుకథలు (జవాబులు)

1. చెఱకుకఱ్ఱ; 2. చీనీపంచదార 3. చేపలు; 4. మఱ్ఱిచెట్టు; 5. పనస చెట్టు; 6. అక్కలకఱ్ఱ; 7. గ్రామఫోను; 8. సౌధము; 9. గబ్బిలము; 10. మిరపపండ్లు.

### మాటలు నేర్చుకో!

1. కనకము; 2. కన్నడము; 3. కదియము; 4. కరణము; 5. కళ్యాణము; 6. కట్టడము; 7. కర్పూరము: 8. కటకము; 9. కవిత్వము; 10. కరటము; 11. కమలము; 12. కర్తవ్యము; 13. కమఠము; 14. కపటము; 15. కపోతము.






Edited and Published by N.Raghava Rao & Printed by N.Kameswari

కాటుక కన్ను




చి॥ అంగలకుదిటి వసుంధరాదేవి (గుంటూరు)

ఇదో చూపు



చి॥ బలిజేపల్లి లక్ష్మి (విజయనగరం)

"మేము హిందీ నేర్చుకుంటున్నాము"



అనకాపల్లి బాలసంఘ బాలురు




: వివరములకు :

ప్రకాష్ ప్రొడకన్స్ — సాంథోమ్ - మద్రాసు 4.